# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

డిసెంబర్ 2023

వెల : రూ.10.00



# భక్త మానస చోరుడు శ్రీ కృష్ణుడు



మధురా నగరంలో ఒక భక్తుడు రోజూ యమునా నదిలో బ్రహ్మముహూర్తంలో స్నానం చేసి బాలకృష్ణుని సాలెగ్రామానికి అర్చన చేసేవాడు.

ఒక రోజు అమావాస్యనాడు మాఘ మాసంలో (జనవరి, ఫిబ్రవరి మాసాలలో వచ్చేది) అతనికి అర్ధరాత్రికే మెలకువ వచ్చి యమునా తీరానికి బయలుదేరాడు. అది చలి కాలం కావటంతో చలి గాలులు వీస్తున్నాయి. అయినా అతనికి దేహ ధ్యాస లేదు. బ్రహ్మ ముహూర్తంలో స్నానం చేసి ఇంటికి వచ్చి తన ఆరాధ్యదైవమైన కృష్ణుని అర్చన చేయాలి అన్నదే అతని ధ్యేయం. చలికి శరీరం గడ్డలు కట్టుకు పోతోంది. అయినా లక్ష్యపెట్టక స్నానం ముగించి చీకటిలో నడుచుకుంటూ ఇంటికి వస్తున్నాడు. కన్ను పొడుచుకునే చిమ్మచీకటి. దారి సరిగ్గా కనిపించటం లేదు. ఒకవైపు వర్షం పడుతోంది. "ఇంటికి ఎప్పుడు చేరుతానా" అని మథనపడుతూ అడుగులు వేస్తున్నాడు.

ఇంతలో లాంతరు పట్టుకుని ఆ దారిన ఒక బాలుడు అతని వైపుకి వస్తున్నాడు. దగ్గరకు వచ్చి "మీరు ఎక్కడికి వెళ్ళాలి?" అని అడిగాడు. "నేను త్వరగా ఇంటికి వెళ్ళి నా స్వామిని అర్చించాలి" అన్నాడు ఆ భక్తుడు. "అలాగా! నేనూ అటే వెళ్తున్నాను నాతో రండి" అంటూ దారి చూపిస్తూ నడవ సాగాడు.

"ఎవరితడు? ఇతని దర్శించిన మాత్రం చేతనే నాకు ఎంతో ఆనందం కలుగుతోంది? ఇతని వాక్కు ఎంత మధురంగా ఉంది? ఇతడు ఎంత అందంగా ఉన్నాడు? ఎంత ముద్దొస్తున్నాడు?" ఇలా అలోచనలు మనస్సు మెదులుతుండగా ఇంటికి చేరాడు. "బాబూ ఎవరు నీవు? నీ పేరేమిటి? ఇంత రాత్రిలో నాకు సహాయంగా వచ్చావు! అని అడిగాడు.

ఆశ్చర్యం! ఆ బాలుడు అంతర్ధానమైపోయాడు. "ఓహో! ఇతడు నా బాలకృష్ణుడే" అని ఆనందాశ్చర్యాలలో మునిగి తేలాడు.

"భగవంతడు ఎల్ల వేళలా భక్తుడి వెంటనే ఉంటాడు" అనటానికి ఈ భక్తుని ఉదంతమే ఒక నిదర్శనం.

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ

సంపుటి 43 సంచిక 4

పేజీలు 44

డిసెంబర్ 2023

5సం॥ల చందా రూ. 500

2సం॥ల చందా రూ. 240

సంవత్సర చందా రూ. 120

విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్ట్ Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ – 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

దాశరథీ శతకము ............................ ..........4

శ్రీబాబూజీ ఉవాచ........................................ 5

అమ్మమాట.................................... ............ 7

దానశీలత్వము ......... ... ............ ..... .........9

శ్రీరాముని కృప ..............................................10

వాచాజ్ఞానం .....................................................12

అంతా గోపాలునికే తెలుసు.......................14

గురవే నమః ...................................................16

గురు కృపాహి కేవలమ్ ...........................18

దాన ఫలితం.................................................20

వాసన ..................... ................ ................ 21

కంచి పరమాచార్య ...... ................................25

నారద భక్తి సూత్రాలు ................... ..............27

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు .....................29

మనశ్శతకము ...........................................30

నిరీక్షణ ....................................................................31

నిర్మలభక్తి ......... ......... ........ ......... ..... ... ....33

బిచ్చగాడు ................................................... ...35

హైదరాబాద్ కార్యక్రమాలు ...... ..... ......37

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38

విష్ణు కథలు ...... ........................ ..................40

## **దాశరథీ శతకము** - భద్రాచల రామదాసు

**41)** **కుక్షినజాండపం క్తులొన గూర్చి చరాచరజంతుకోటి సం**
**రక్షణసేయు తండ్రివి పరంపర నీ తయుండనైన నా**
**పక్షము నీవుగావలది పాపము లెన్ని యొనర్చినన్ జగ**
**ద్రక్షక కర్తవీవెకద దాశరథీ! కరుణాపయోనిధీ!**



భావం - జగముల నేలే దాక్షిణ్యమూర్తీ! కడుపులో అనేక బ్రహ్మాండములను పదిలముగా నిలిపిన వాడవు. చేతనములను, అచేతనములను రక్షించు దైవానివి. నీ ప్రపంచములోని అణువునైన నన్ను నా పాతకముల నుండి రక్షింపుము.

*కొత్త కోడలు మామగారికి పాడైపోయిన పిండితో చేసిన రొట్టెలు ఎందుకు పెట్టింది?
*త్రిమూర్తులనే ప్రసన్నం చేసుకొన్న గురుభక్తుడెవరు?
*భగవంతుని నమ్ముకుంటే ఆయన కోర్టుకు వచ్చి సాక్ష్యం చెబుతాడా?
*మానసిక పూజలో కూడా పిసినారితనం చూపించినా, రాముని కృపకు పాత్రుడయినది ఎవరు?
*బండికి కట్టిన మూడు ఎద్దులు ఏమి చేశాయి?
*గుహుడు ఎవరిని గంగలో ముంచేద్దామని అనుకున్నాడు?
*కర్ణుడు శ్రీకృష్ణుడికి ఎడమ చేతితో ఎందుకు దానమిచ్చాడు?
*ఏ పదవీ కోరనివాడికి ఏమి దొరుకుతుంది?
*మనది ఏ కులం? ఏ మతం?
*పడవ మునగకుండా, బస్సు పడిపోకుండా కాపాడిన శక్తి ఏది?

***సమాధానాలు లోపలి పేజీలలో............................***

# శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

8.9.81.

ఈరోజు రాత్రి 10 గం॥లకు శ్రీ బాబూజీ భక్తులకు దర్శనం యిచ్చారు. శ్రీ బాబూజీ పురుషోత్తంగారిని చూసి, "ఏమండీ పంతులుగారు! ఏమిటి విశేషాలు? ఓహో! మీరు తెలఘాణ్యులు కదా! నియోగులనుకున్నానండి అని, అదుగో చూశారా! అప్పుడే మీలో ఆలోచన బయలుదేరింది. స్వామి నన్ను పంతులు అని ఎందుకు అన్నారు. నాలో భక్తిలోపమా? లేక నేను క్లాసులో టీచర్‌లాగా చెప్పటమేగాని ఆచరించటం లేదనే ఉద్దేశ్యంతో అన్నారా? అని మీరు అనుకుంటున్నారు కదండీ పురుషోత్తం గారూ! నిజం చెప్పండి" అన్నారు.



ఆ విషయం యథార్థమేనని పురుషోత్తంగారు అంగీకరించారు. శ్రీ బాబు మాట్లాడుతూ, "మనది ఏ కులము? గురుకులము. మనది విశ్వమతము. మనకి కులమత వివక్షతలు లేవు. ఇప్పుడు మీకు శాంతిగా ఉందా?" అన్నారు శ్రీ బాబు పురుషోత్తంగారిని ఉద్దేశిస్తూ.

శ్రీ బాబు ఇంకా మాట్లాడుతూ, "గురుశిష్యుల సంబంధం చాలా గొప్పది. నారద భక్తి సూత్రాలలో చెప్పినట్లు పరమాత్ముని తత్త్వవిచారణ చేసిన వాడితోనే స్నేహం చేయాలి. వారితోనే మాట్లాడాలి. వారి ఇంటనే భుజించాలి గాని దానికి భిన్నంగా ఉన్నవారితో ఏ రకమైన సంబంధము పనికిరాదు. షడ్రసోపేతమైన భోజనము అయినప్పటికీ భక్తిలేనివాడు పెట్టినప్పుడు తినరాదు. భక్తి కలుగు కూడు పట్టెడైనను చాలు అన్నారు వేమన. అందుచేతనే సత్సాంగత్యము అవసరం.

కాని మానవుడు కొన్ని ఆకర్షణలకి లొంగిపోతాడు. అష్టసిద్ధులకి మోహితుడవుతాడు. అష్టసిద్ధులు ఎవరైనా సంపాదించవచ్చు కాని దానివలన

లాభం ఏమిటి? అవి తరించటానికి ఉపయోగపడతాయా? టేప్ రికార్డరు వుంది. పాట పాడుతుంది. ఆ టేప్ అరిగేదాకా ఆ పాట వినడుతుంది. దానివలన ఆ రికార్డర్‌కి ఏమిటి లాభం? అది తరించ గలుగుతుందా?

కపటభక్తి పనికిరాదు. సత్యభక్తుడై ఉండాలి. కపట భక్తుడు పతనమవుతాడు. సత్యభక్తుడు గురువు యొక్క ప్రబోధంలోని మాధుర్యాన్ని గ్రహించగలుగుతాడు. గురుప్రబోధాన్ని విని దానిద్వారా తనలోని దుర్గుణాలను హరింపజేసుకుంటాడు. దానిద్వారా మనస్సు శుద్ధి చెందుతుంది.

మీకు ఒక ఉదాహరణ చెపుతాను. మామిడి చిగురు లేతగా స్వచ్ఛంగా ఆకర్షవంతంగా ఉంటుంది. ఆ చిగురు యొక్క మాధుర్యం కోకిలకి తెలుస్తుంది గాని కాకికి ఏమి తెలుస్తుంది? కాబట్టి ఈ బోధామృతాన్ని శ్రవణం చేయటమే కాక మననం చేసుకోవాలి. దానిని ఆచరణలో పెట్టాలి" అన్నారు.

* * *

ఓం సహనా వవతు। సహనౌభునక్తు।
సహవీర్యం కరవావహై। తేజస్వినావ ధీతమస్తు మావిద్విషావహై॥
ఓం శాన్తి శ్శాన్తి శ్శాంతిః ॥

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***డిసెంబర్ 2023 :*** AS 2781, 7159, 7416, 7957 - 7959, 8327, 8836, 9148 - 9151, 9153 - 9156, 9160, 9163 - 9166, 9168 - 9175, 9181 - 9186, 9188, 9189, 9191 - 9194 ; LM 4397, 4398

***జనవరి 2024 :*** AS 2424, 6373, 6421, 7217, 7963, 7975 - 7979, 7982, 7983, 7986, 7988, 9196 - 9199, 9201; LM 4404 - 4407

## అమ్మ మాట

- జపమాలా ప్రసాద

***ప్రథమ పూజితా ! గణాధిపా!***

ప్రణవ స్వరూపుడు వినాయకుడు. ఆయన రూపమే దానిని మనకి సూచనప్రాయంగా తెలియజేస్తుంది- **'ప్రణవ స్వరూప - వక్రతుండం'** అని ఆయనని వర్ణించారు. ఆ మహాగణపతి పుట్టుకే ఆయన యొక్క తత్వాన్ని మనకి తెలియజేస్తుంది. ఆయన సాధారణ మానవులవలె పుట్టలేదు. సాక్షాత్తు జగన్మాతా పితరులైన పార్వతీ పరమేశ్వరులకు ఆవిర్భవించాడు. జగన్మాత పార్వతీదేవిచే ప్రాణప్రతిష్ఠ జరిగిన తరువాత, పరమేశ్వరుడి శూలానికి గురయి, శిరస్సు పోగొట్టుకొని, తిరిగి ఆ పరమేశ్వరుడి చేతనే గజాసురుడి యొక్క తలను పొంది, పునఃప్రాణ ప్రతిష్ఠను చేయించుకున్న ధన్యుడు గజాననుడు. **'అనేక దంతం భక్తానామ్ ఏకదంత ముపాస్మహే'** - అనేకములైన కోరికలు కలిగిన భక్తుల కోరికలన్నీ తీర్చే **'ఏకదంతమ్'** ఏకస్వరూపుడుగా ప్రకాశిస్తూ, తాను పూర్ణకాముడై, అందరి కోరికలనూ తీర్చే దాత గణపతి.



గణాధిపత్యం తనకే కావాలని కోరుకున్నాడు కుమారస్వామి. అందుకు తగ్గ బలమూ, రూపమూ, చురుకుదనమూ కూడా తనకి కలవని కించిత్ గర్వంతో తలచాడు కూడా. తానుగా ఎటువంటి ఆధిపత్యాలనీ కోరలేదు గణపతి. తనకి ఆధిపత్యాలకి కావలసిన అర్హతలున్నాయని కూడా అనుకోలేదు. కేవలం తన గురుడైన పరమేశ్వరుని యిచ్ఛ ఎలా వుంటే, అలాగే జరుగుతుందని పరిపూర్ణంగా విశ్వసించాడు. ఏ పదవీ కోరలేదు కనుకనేనేమో అంత అత్యున్నత పదవిని అధిరోహించాడాయన.

సర్వ విఘ్నాలనీ హరించే ప్రథమ పూజితుడయ్యాడు. ఆయన కుమారస్వామికి కేవలం భ్రాతమాత్రమే కాక గురువు కూడా అయ్యాడు. "కుమారగురవే నమః" అని ఆయన నామాలలో వున్నది. గణపతిని ఉపాసన చేసేవారు గాణపత్యులని పిలవబడుతూ తమ తమ కోర్కెలను

తీర్చుకుంటున్నారు. కానీ నిజమైన దేవతా (గణపతి) ఉపాసన చేసిన సాధకుడు, తన యిష్టదైవమునే సమస్త దేవతలలోను, సమస్త దేవతలను తన యిష్టదైవములోను దర్శిస్తారు. అటువంటి వారే తమ యిష్టదేవతను **'తత్వతః'** తెలుసుకున్న వారవుతారు.

**'ఓం గం గణపతయే నమః'** - 'ఓం' అనే ప్రణవమునకు, మనకు మధ్యనున్న 'గం' అంటే 'మాయాశక్తి'ని హరించే ఆ గురుగణపతి సర్వులకూ అఖండైశ్వర్య భోగభాగ్యములు, సుఖశాంతులు, విద్యాబుద్ధులు, భక్తి, జ్ఞాన వైరాగ్యములను ప్రసాదించి రక్షించుగాక!"

***పెదనిండ్రకాలను శాఖలో కార్యక్రమాలు***

**** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును****

**డిశంబరు 2023**

7 గురు: శ్రీ గురుదశమి - శ్రీ గురుదేవుల వార్షిక పుణ్యారాధన. శ్రీ సద్గురు పాదపూజ

17 ఆది: ధనుర్మాస వ్రత ప్రారంభం - ధనుర్మాసంలో ప్రతిరోజు ఉ. 5.00 గం.లకు శ్రీ సద్గురుపాదపూజ

23 శని: ముక్కోటి ఏకాదశి, గీతాజయంతి - శ్రీ సద్గురు పాదపూజ

26 మంగళ: మార్గశిర పూర్ణిమ, దత్త జయంతి - శ్రీ సద్గురు పాదపూజ

**జనవరి 2024**

6 శని: శ్రీ గురుదశమిం - శ్రీ సద్గురు పాదపూజ

14 ఆది: భోగి పండుగ - శ్రీ సద్గురు పాదపూజ

15 సోమ: సంక్రాంతి పండుగ - శ్రీ సద్గురు పాదపూజ

25 గురు: పుష్య పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ

# దానశీలత్వము

-శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానంద గిరి స్వామి

పూర్వము ఒకప్పుడు కర్ణుడు తన గృహంలో అభ్యంగన స్నానం చేస్తున్నాడు. నవరత్న ఖచితమైన ఒక పాత్రలో నూనె, మరొక పాత్రలో సున్నిపిండి ఉంచుకుని, ఒక చోట కూర్చుని స్వయంగా నూనెతో తలంటుకుంటున్నాడు. సరిగ్గా శ్రీకృష్ణుడు అదే సమయానికి అతని గృహానికి వచ్చాడు. కర్ణుడు తలంటుకోవటం, ప్రక్కనే నవరత్నఖచితమైన పాత్రలు ఉండటం చూసి, నటనసూత్రధారియైన గోవిందుడు ఆ పాత్ర తనకి కావాలని అడిగాడు. దేవేంద్రునకు తన సహజ కవచ కుండలములనే దానము చేసి, దానకర్ణుడు అనిపించుకున్న మహానుభావుడు, ఇప్పుడు సాక్షాత్ పరమాత్ముడే చేయిచాచి, గిన్నె ఇమ్మని అడిగితే కర్ణుడు వెనుకంజ వేస్తాడా? వెంటనే కర్ణుడు కుడిచేత్తో తలంటు పోసుకుంటున్నాడు కనుక, ఎడమచేతితో ఆ గిన్నెను తీసి శ్రీకృష్ణుడికి సమర్పించబోయాడు. కాని కృష్ణుడు దాన్ని తీసుకోకుండా, "కర్ణా! నీఎడమచేతితో నాకు సమర్పించుట? ఇది శిష్టాచారము కాదని నీకు తెలియదా?" అని అడిగాడు.

కర్ణుడు "ఓ కృష్ణా! ఇప్పుడున్న ధనము మరుక్షణంలో మాయమై పోవచ్చు! ఇప్పుడున్న జీవితం ఉత్తరక్షణంలో అంతమైపోవచ్చు! యమధర్మరాజు ఎవరిపైనను విచక్షణ చూపడు. జీవుల ధర్మబుద్ధి త్వరితగతిని మార్పునొందుచుండును! కాబట్టి తలంటుకొనుచున్న నూనె చేతిని, కడిగి దానితో నీకు ఆ పాత్ర ఇచ్చే లోపల నా బుద్ధి ఏమి మారిపోవునో! అంతవరకు నా జీవితం ఉంటుందో లేదో! అనే విచికిత్స నాలో కలిగి, తత్ క్షణమే నేను దాన్ని నీకు ఇవ్వబోయాను. అంతేకాని నాకు తెలియక కాదు" అని అన్నాడు. కర్ణుడి ఆధ్యాత్మిక భావపరిపూర్ణమైన ఆ మాటలు విని శ్రీకృష్ణుడు చాలా సంతోషించాడు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, హైదరాబాద్ వాస్తవ్యులు అయిన శ్రీమతి కంచేటి కృష్ణకుమారిగారు 3-11-2023 శుక్రవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 49 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

# శ్రీరాముని కృప

సేకరణ – సి.హెచ్. బాబ్జి

భారతీయ సత్పురుషులు, మహాత్ముల గురించి అనేక గాథలు ప్రచారంలో ఉన్నాయి. అలాంటి కథల్లో తులసీదాసు చెప్పిన ఈ కథ గమనిస్తే.... అప్పుడు తులసీదాసు కాశీలో నివసిస్తున్నారు. ప్రతి ఇంటా ఆయనకూ, ఆయనతో ప్రణీతమైన రామాయణ గ్రంథానికి సన్మాన సత్కారాలు లభించేవి. రామనామాన్ని భ్రమరంలాగా జపించేవారి ముందు ఆయన పవిత్రమైన తులసి మొక్కలా గోచరించేవాడు. అలాంటి పరమ భక్తుడైన తులసీదాసు భక్తుల సందేహాలను తీర్చేవాడు.

ఒకనాడు ధనపాలుడనే ధనికుడు, తులసీదాసు వద్దకు వచ్చాడు. అతడు పరమలోభి. అతడు ఒక ఆశ్చర్యకరమైన ప్రతిపాదన చేశాడు. ఇంటింటా శ్రీరామచంద్రుడు అనేక ఉపచారాలతో అర్చింపబడుతున్నాడని ఆయన ఎరుగును. తులసీదాసుతో, 'మహాత్మా! నాకు కూడా శ్రీరామచంద్రుణ్ణి సకలోపచారాలతో అర్చించాలని ఉంది' అన్నాడు. 'అలాగే చేయి నిన్ను అడ్డుకొన్నదెవరు?' అన్నాడు తులసీదాసు. 'అది కాదు స్వామీ! అర్చనకు పూలు, పళ్ళు, ధూప, దీపాదులు అవసరం కదా? వీటికి దమ్మిడీ వ్యయం చేయకుండా అర్చన జరిగే ఉపాయం చెప్పండి' అన్నాడు ధనపాలుడు.

అమితాశ్చర్యంతో ఆ లోభిని ఆపాదమస్తకం తిలకించాడు తులసీదాసు. అతడి పిసినారితనం చూసి, ఆయనకు జాలి కలిగింది. చాలాసేపు మౌనంగా ఉన్నాడు. చివరకు, 'మానసపూజ తప్పించి నాకు అన్యమార్గం కనిపించడం లేదు. మానసపూజ అంటే, అన్ని ఉపచారాలూ కాల్పనికాలు. నీవు అన్నీ చేస్తున్నట్లు మనస్సులో ఊహించాలి. నీవు కావలసినన్ని ఉపచారాలతో ఆ విధంగా చేయవచ్చు. చిల్లిగవ్వ ఖర్చుకాదు' అన్నాడు తులసీదాసు.

ధనపాలుని ఆనందానికి అవధులు లేవు. ఇంతకాలం ఇలాంటి ప్రణాళిక కోసమే తాను ఎదురుచూశాడు. అయితే కాల్పనికమైనా ఎక్కువ పదార్థాలు నివేదింపదలచలేదు. అందువల్ల 'ఏ విధంగా మానసపూజ చేయాలో సవివరంగా చెప్పండి' అని తులసీదాసును అడిగాడు ధనపాలుడు.

శ్రీరామచంద్రుణ్ణి ఒక్క నిమిషం ధ్యానం చేసి, 'ఆయన ప్రతిమను బంగారు సింహాసనంపై ప్రతిష్ఠించు. రకరకాల పుష్పాలతో అలంకరించు. ఆపైన వేడి చేసిన ఆవు పాలల్లో కాస్తంత పంచదార కలిపి నివేదన చేయి. పంచదార కలపడం మాత్రం మరువకు సుమా! నా రాముడు పంచదార లేని పాలు త్రాగలేడు. అనుదినం ఈ విధంగా మానసపూజ చేయి, దమ్మిడీ వ్యయం కాదు' అన్నాడు తులసీదాసు.

ధనపాలుని లోభగుణం అటుంచి, అతడికి నిష్ఠ మెండు. తులసీదాసునే గురువుగా ఎంచి ధనవ్యయం లేని మానసపూజ మొదలుపెట్టాడు. పంచదార ఎక్కువ వాడకం జరుగరాదని, ఒక చిన్న డబ్బా, ఒక చెమ్చా కొన్నాడు. (అంతా ఊహలోనే, నిజంగా అవిలేవు). ఈ విధంగా కొన్ని ఏళ్ళు గడిచాయి. ఒకనాడు పాలు నివేదన వేళకు మనస్సులో చెమ్చా కనపడలేదు. చేసేది లేక, డబ్బా నుండి పంచదారను. పాలల్లోకి ఒంపాడు. పంచదార ఎక్కువ పడింది. వెంటనే మనస్సులో ఉన్న పాలగిన్నెలో చేయి పెట్టి, కరగని పంచదార తీసివేయ సాగాడు. పదిహేను సంవత్సరాలుగా ఈ లోభి మానసిక పూజను స్వీకరిస్తున్నాడు శ్రీరామచంద్రుడు. అయినా, అతడి పిసినారితనం కించిత్తయినా తగ్గలేదు.

ప్రభువుకు అమితమైన అనుకంపన కలిగింది. భక్తుని చేయి గట్టిగా పట్టుకుని 'ధనపాలా! పాలూ కాల్పనికమే, పంచదారా కాల్పనికమే. కాల్పనిక పంచదార కొంచెం ఎక్కువగా పడితే ఏమిటయ్యా! ఉండనీయరాదూ!' అన్నాడు.

శ్రీరామచంద్రుని కరస్పర్శ మూలంగా ధనపాలునిలో పరమ వైరాగ్యం కలిగింది. వెంటనే అతడు నిజమైన భక్తి ప్రపత్తులతో శ్రీరాముణ్ణి ధ్యానించి తరించాలని తపోభూమికి వెళ్ళిపోయాడు. ఇది నిజంగా జరిగిన సంఘటన. దీన్ని బట్టి ఆ రాముడి కృప ఎలాంటిదో అర్థమవుతుంది.

# వాచాజ్ఞానం

(గత సంచిక తరువాయి) - పాలూరి కాళీప్రసాద్

ఆధ్యాత్మిక జీవితంలో కూడా ఈ జ్ఞానం, ఈ వేదాంతం మన నరనరాల్లో జీర్ణించుకొని అది మన సహజ స్థితిగా మారేవరకు నిరంతర అభ్యాసం, సాధన చేయవలసిందే. అది లేకుండా కేవలం మాటలలో భక్తి జ్ఞాన వైరాగ్యాలను ఒలకబోయడం వ్యర్థం. ఈ విశ్వమంతా నిజంగా పరమాత్మ సృష్టే, ఇందులో నాదంటూ ఏదీ లేదు అని నిజంగా విశ్వసించిన వాడు పైకి ఏమీ మాట్లాడకపోయినా అంతరంగంలో పరమ భక్తుడై నిరంతరం ఆ భగవచ్చింతన లోనే ఉంటూ, ఎప్పుడు ఏది లభిస్తే అది ప్రసాదంగా స్వీకరిస్తూ, కర్తృత్వ భోక్తృత్వాలను తనమీద వేసుకోకుండా నిగర్విగా జీవనం సాగిస్తూ ఉంటాడు. అలాగే కనిపించే విశ్వమంతా భగవత్స్వరూపమే అన్న అవగాహన దృఢంగా ఉన్నవాడు జ్ఞానియై అంతటా భగవంతునే దర్శిస్తూ, దేని యెడల రాగద్వేషాలు లేక సహజ విరాగియై ఉంటాడు. ఇటువంటి విశ్వాసము, అవగాహన లేకుండా కేవలం వినడానికి, మాట్లాడడానికి అలవాటు పడిన మానవుడు పైకి ఎంత భక్తునిగా నటించి ఎన్ని భగవత్కైంకర్యాలు చేసినా, "నాదేమీ లేదు, అంతా భగవంతుడిదే. ఆయనదే ఆయనకు ఇచ్చాను" అని పైకి ఎన్ని మాటలు చెప్పినా గుడిలోకి వెళ్ళి దేవుని మూర్తిని చూడగానే "ఈరోజు నేనిచ్చిన నగలను వేశారా లేదా? నేను పెట్టిన బట్టలను కట్టారా లేదా?" అని ఇలాగే అతడి మనస్సు ఎంతసేపూ 'నేను, నేను' చుట్టూనే తిరుగుతూ ఉంటుంది. పట్టుచీర అరువిచ్చి ఆ కట్టుకున్నావిడ ఎక్కడ మాపేస్తుందో అని వెనకాలే పీట పుచ్చుకుని తిరిగినట్టు 'నేనిచ్చాను' అనే భావన వదలనంత కాలం పైకి ఎన్ని మాటలు చెప్పినా ఉపయోగం లేదు.

అలాగే మరి కొంతమంది ఎవరైనా మర్యాదకి "బాగున్నారా!" అని పలకరించినా "ఈ శరీరం ఎప్పుడూ బాగోదు, ఆత్మ ఎప్పుడూ బాగానే ఉంటుంది. నువ్వు అడిగినది శరీరాన్నా, లేక ఆత్మనా?" అంటూ వారికి పెద్ద వేదాంత ఉపన్యాసం చెప్పి "వీడిని ఎందుకు పలకరించానురా దేవుడా!" అనుకొనేలా చేస్తారు. నిజంగా బ్రహ్మజ్ఞాన సంపన్నులయిన మహాత్ములు ఎవరూ ఇలా మాట్లాడరు. వాచావేదాంతులే ఇలా ప్రవర్తిస్తారు. మహాత్ములు ఆంతర్యంలో నిరంతరం పరబ్రహ్మ వస్తువుతో

అనుసంధానులై ఆ బ్రహ్మామృతాన్ని గ్రోలుతూ ఉన్నా పైన వ్యవహారంలోకి వచ్చేసరికి సాధారణ మానవుల మాదిరిగానే ప్రవర్తిస్తారు. తరచి చూడగల హృదయం ఉన్నవారికి మాత్రమే వారి అసలు సత్తా కొంచెమైనా అంచనాకు వస్తుంది తప్పితే మామూలుగా వారిని మహాత్ములని పోల్చుకోవడం కష్టం.

కాబట్టి నిజమైన భక్తికానీ, జ్ఞానంకానీ, వైరాగ్యంకానీ సహజసిద్ధంగా ఉండాలి తప్పితే అవి తెచ్చి పెట్టుకొనేవి కావు, పైకి ప్రదర్శించేవి కావు. అలా పైకి ప్రదర్శించినంత కాలం వాటిలోని నిజమైన సారాన్ని అనుభవంలోకి తెచ్చుకోలేము. ఆ మూడిటి ఫలస్వరూపమైన ఆత్మానందాన్ని పొందలేము. ఎప్పుడైతే ఈ పైపై మాటలన్నీ కట్టిపెట్టి, నిరంతర భగవత్స్మరణలో, తత్వచింతనలో మనస్సును ఊరబెట్టి, ఆ పరమాత్మ తప్ప మరియొకటి మన మనస్సులో నిలువలేని స్థితికి చేరుకుంటామో అప్పుడే నిజమైన అనుభవ జ్ఞానం, అనుష్ఠాన వేదాంతం అలవడుతుంది. శ్రీ బాబూజీ మహరాజ్ వారు చెప్పినట్లుగా నీటిలో సగం మునిగిన చెంబు బుడబుడ శబ్దాలు చేస్తుంది కానీ, పూర్తిగా నీటితో నిండిన చెంబునుంచి ఏ శబ్దమూ రానట్లుగా అటువంటి అత్యున్నత స్థితికి చేరిన వ్యక్తినుంచి వాచాజ్ఞానం వెలువడదు. అతడు తన ఆచరణతోనే సర్వులకు ఆదర్శప్రాయుడై నిలుస్తాడు.

కేవలం గ్రంధాలు చదివి 'ఇది సత్తు, ఇది అసత్తు, ఇది చిత్తు' అని ఎంతసేపూ నీలో నువ్వుగానీ, లేదా ఇతరులతోగానీ వృధా చర్చలు పెట్టుకోకుండా నిరంతరం జగన్మాత స్మరణలో గడిపితే 'సదసద్రూప ధారిణి' అయిన ఆ జగన్మాత అనుగ్రహం, సాక్షాత్తు జగన్మాతృ స్వరూపులే అయి 'సదసద్రూప సంపన్ను'లయిన శ్రీ గురుదేవుల అనుగ్రహం కలిగిన నాడు నీవు దర్శించేదంతా సత్య వస్తువే కానీ అక్కడ ఇంక అసత్తుకు స్థానమే లేదు. 'నీవు చూచునదెల్ల నీవయే' అను 'తత్త్వమసి' వాక్యానికి అర్థమై నిలుస్తావు.

# అంతా గోపాలునికే తెలుసు!

- రెడ్డి శ్రీదేవి

'నాకేమి తెలుసు ? అంతా గోపాలుడికే తెలుసు.' కల్మషం లేని భక్తుడిని ఆదుకొన్న కృష్ణుడి లీల............ ఉత్తరప్రదేశ్ లో యాభై ఏళ్ళ క్రితం గంగానది ఒడ్డున ఒక చిన్న గ్రామంలో పడవ నడుపుకొనే ఒక వ్యక్తి వుండేవాడు. ఆయనకు ముగ్గురు సంతానం. ఒక అమ్మాయి, ఇద్దరు అబ్బాయిలు. అతను చాలా అమాయకుడు. 'చదువులేని వాడిని అని నన్ను దూరం పెట్టకు. నేను నీవాడిని, నీవు నావాడివి' అని దేవుడికి చెప్పుకొనేవాడు. అందరూ అతని మాటలకు నవ్వుకొనేవారు. అతను పట్టించుకొనేవాడు కాదు. ఎవరు ఏమి అడిగినా 'నాకేమి తెలుసు, అంతా గోపాలుడికే తెలుసు' అనేవాడు.

కూతురికి పెళ్ళి చేయడానికి డబ్బు అవసరం అయ్యి ఒక వ్యాపారి దగ్గర అప్పు తీసుకొని, పెళ్ళిచేసి, రెండు సంవత్సరాలు కష్టపడి, డబ్బు కూడబెట్టి, అప్పు తీర్చడానికి వ్యాపారి దగ్గరకు వెళ్ళినప్పుడు ఇతను అమాయకుడు అని తెలిసిన వ్యాపారి, అప్పు తీరిపోయింది అని చూపే పత్రం తన దగ్గరే పెట్టుకొని, ఇంకా ఇన్ని రూపాయల అప్పు వుంది అని చెప్పే ఒక నకిలీ పత్రాన్ని తయారుచేసి దాన్ని ఇతనికి ఇచ్చిపంపాడు. నెల రోజుల తరువాత అప్పు తీర్చడంలేదని ఇతని మీద ఫిర్యాదు చేసి కోర్టునుండి నోటీసులు వచ్చేలా చేసాడు వ్యాపారి. ఇతను కోర్టు బోనులో నిలుచున్నాడు. 'అప్పు తీర్చలేదా?' లాయరు ప్రశ్న. 'తీర్చేశాను' 'అందుకు సాక్ష్యంగా కాగితాలు వున్నాయా?' 'ఇదిగో' 'ఇందులో నీవు అప్పు వున్నావని వ్రాయబడింది' 'ఏమో నాకేం తెలుసు? అంతా గోపాలుడికే తెలుసు'. 'నీవు అప్పు తీరుస్తున్నప్పుడు, ఎవరైనా దగ్గరున్నారా?' 'అంతా గోపాలుడికే తెలుసు.' కోర్టు హాల్లో నవ్వులు.

జడ్జి మనసులో అనుమానాలు. ఆయనకు అనిపించింది: 'ఈ వ్యక్తి అమాయకుడు. అతను అబద్ధం చెప్పడంలేదు. కచ్చితంగా ఏదో జరిగింది. 'అప్పుడు ఆయన 'ఈవ్యక్తి అప్పు తీర్చిన సమయంలో 'గోపాల్' వున్నాడని, అతనికి అంతా తెలుసు అంటున్నాడు కదా' అతని పేరుతోనే సమన్లు పంపండి' అని చెప్పాడు. అలానే చేశారు కోర్టువాళ్ళు. సమన్లు తీసుకొని 'ఇక్కడ గోపాల్ ఎవరు?' అని గ్రామానికి వెళ్ళిన కోర్టు వ్యక్తికి గోపాల్ పేరుతో ఎవరూ లేరని తెలుస్తుంది. అపుడు ఎవరో 'ఇక్కడ గోపాల్‌జీ మందిరం ఒకటుంది. అక్కడ పూజారిని అడగండి' అన్నారు. వాళ్ళు వెళ్ళి ఆ సమన్లను ఆ పూజారికిచ్చి వెళ్ళిపోయారు. పూజారి దాన్ని చదివి, ఏరోజు 'గోపాల్' అనే వ్యక్తిని సాక్షిగా కోర్టుకు రమ్మని వుందో,

ఆరోజు గుడిలోని గోపాలకృష్ణుడి విగ్రహాన్ని అందంగా అలంకరించి, ఆ సమన్లను ఆయన పాదాలవద్ద పెట్టి, 'ప్రభూ! ఈ అమాయక భక్తుడిని నీవే కాపాడాలి' అని ప్రార్థించాడు.

కోర్టు హాల్లో విచారణ మొదలైనప్పుడు, 'గోపాల్ అనే వ్యక్తి వచ్చివుంటే ఆయన్ని సాక్షిగా ప్రవేశపెట్టండి' అని జడ్జి చెప్పారు. అపుడు ఒక ముసలాయన వచ్చి బోనులో నిలుచొన్నాడు. 'ఈ వ్యక్తి, ఆ వ్యాపారికి డబ్బు ఇస్తున్నప్పుడు నీవు చూసావా?' 'అవును, చూశాను' 'మరి ఈ పత్రంలో అప్పు తీర్చాలి అని వుంది?' 'అది అసలు పత్రం కాదు. నకిలీది. అసలు పత్రం వేరే చోట వుంది' 'ఎక్కడుంది?' 'వ్యాపారి ఇంట్లో, ఫలానా గదిలో, ఫలానా బీరువాలో, ఫలాన సంచిలో' వ్యాపారిని అక్కడే వుండమని, ఆ గ్రామానికి వెళ్ళి వ్యాపారి ఇంట్లోని పత్రం తీసుకురమ్మని మనుషుల్ని పంపాడు ఆ జడ్జి. వాళ్ళు వెళ్ళి పత్రం తెచ్చారు. అందులో అప్పు తీర్చేసినట్టు వ్రాయబడివుంది. అమాయకుడిని మోసగించినందుకు వ్యాపారికి జరిమానా విధించారు.

సాక్ష్యం చెప్పిన ముసలాయన కోర్టు బయటికివెళ్ళి, మళ్ళీ కనిపించలేదు. జడ్జి గబగబ వెళ్ళి ఆ అమాయకుడిని ఆపి 'ఎవరు ఆ ముసలాయన?' అని అడిగితే మళ్ళీ అదే సమాధానం 'నాకేమి తెలుసు? అంతా గోపాలుడికే తెలుసు.'

జడ్జి తన గదిలోకెళ్ళి ఏడుస్తున్నాడు. గమనించిన లాయర్లు, ఇతరులు పరుగెత్తికెళ్ళి ఆయన్ని 'సర్! మీరెందుకు ఇలా దు:ఖిస్తున్నారు?' అని అడిగితే ఆయన అన్నారట: 'నేను జడ్జిగా దర్జాగా కుర్చీలో కూర్చొని, జగదీశ్వరుడిని బోనులో నిలబెట్టి ప్రశ్నించానే? ఈ ఘోర పాపానికి ప్రాయశ్చిత్తం వుంటుందా?'

ఆ తరువాత ఆ జడ్జిగారు ఏమి చేసారో తెలిస్తే మనం ఆశ్చర్యపోతాం! ఆయన తన కుటుంబపోషణను తన పెద్ద కొడుక్కి అప్పగించి, తన పదవికి రాజీనామా చేసి, బృందావనం వెళ్ళి, అక్కడ ఒక సన్యాసి లాగా భిక్షాటన చేస్తూ, బృందావనపు మట్టిని కళ్ళకద్దుకొంటూ, రాధాకృష్ణ మందిరం బాంకే బిహారీ ప్రేం మందిరం వచ్చే భక్తులు ప్రదక్షిణం చేసే దారిని రోజూ శుభ్రం చేస్తూ బృందావనం లోనే వుండిపోయాడు. అందరూ ఆయన్ని 'జడ్జి స్వామీ' అనేవారట.

డిజిటల్ యుగంలో ఈ మాయలు, చమత్కారాలు ఏమిటి? అని ప్రశ్నించే వారితో వాదించను. నమ్మనివారికి గుడిలో వున్నాడు. నమ్మినవారికి గుండెలో వున్నాడు. మొత్తానికి వున్నాడు.

## గురవే నమః

సేకరణ - కె. రాఘవరాజు

పూర్వం కౌత్సుడు అనే పేద పిల్లవాడిని విద్యాధరుడు అనే గురువుగారు తన ఆశ్రమానికి పిలుచుకు వచ్చి తనకు తెలిసిన అన్ని విద్యలు నేర్పాడు. ఒకసారి గురువుగారు పని మీద కొన్ని రోజులు బయటకు వెళ్ళాడు. గురువుగారు తిరిగి వచ్చేవరకు కౌత్సుడు ఆశ్రమాన్ని చక్కగా చూసుకున్నాడు.

గురువుగారు తిరిగివచ్చిన కొన్ని రోజులకు కౌత్సుడి చదువు పూర్తయింది. కౌత్సుణ్ణి తీసుకెళ్ళడానికి తల్లిదండ్రులు వచ్చారు. కానీ కౌత్సుడు తాను గురువుగారి దగ్గరే ఉంటానని ఇంటికి రానని ఖరాఖండిగా చెప్పి తల్లిదండ్రులను వెనక్కి పంపాడు.

వాళ్ళు వెళ్ళిన తరువాత గురువు కారణం అడిగాడు. అప్పుడు కౌత్సుడు ఇలా చెప్పాడు "గురువుగారూ మీరు కొన్ని రోజుల క్రితం బయటకు వెళ్ళినపుడు మీ జాతకం చూసాను. మీరు సమీప భవిష్యత్తులో భయంకరమైన రోగంతో ఇబ్బంది పడతారు. అందుకే మిమ్మల్ని వదిలి వెళ్ళలేను" అని చెప్పాడు.

కొన్ని రోజులకు గురువుగారికి క్షయ రోగం వచ్చింది. ఆ కాలంలో క్షయకు చికిత్స లేకపోవడంతో కాశీకి వెళ్ళి దాన ధర్మాలు, పుణ్య కార్యాలు చేయాలని గురుశిష్యులు కాశీకి వెళ్ళారు. గురువుగారి రోగం చూసి కాశీ ప్రజలు వీళ్ళను అసహ్యించుకున్నారు. కానీ కౌత్సుడు గురువుగారికి సేవలు చేస్తూనే ఉన్నాడు. ఎంతోమంది గురువుగారిని వదిలి వెళ్ళమని సలహా ఇచ్చినప్పటికీ కౌత్సుడు మాత్రం గురువుగారిని వదలలేదు.

కౌత్సుడి గురుభక్తికి మెచ్చిన త్రిమూర్తులు అతన్ని పరీక్షించాలని అనుకున్నారు. మొదట బ్రహ్మ మారువేషంలో వెళ్ళి గురువుని వదిలేయమని సలహా ఇచ్చాడు. కౌత్సుడు బ్రహ్మ చెప్పిన మాటలు వినలేదు. మరలా విష్ణువు మారువేషంలో వచ్చి సలహా ఇచ్చినా కూడా కౌత్సుడు వినలేదు. చివరికి పరమేశ్వరుడు వచ్చి చెప్పినా వినలేదు. దానికి మెచ్చిన పరమేశ్వరుడు నీకు ఏదయినా సహాయం కావాలా? అని అడిగాడు. మరెవరూ గురువును వదిలేయమనే సలహా ఇవ్వడానికి రాకుండా కాపలా కాయమన్నాడు కౌత్సుడు.

అతని గురుభక్తికి మెచ్చిన త్రిమూర్తులు ప్రత్యక్షమయ్యారు. కొత్సుడికి మోక్షం ఇస్తాం అన్నారు. అప్పుడు కొత్సుడు వారితో నాకు మీ గురించి చెప్పి ఈరోజు మీరు ప్రత్యక్షం కావడానికి కారణమైన నా గురువే నాకు బ్రహ్మ, నా గురువే నాకు విష్ణువు, నా గురువే నాకు మహేశ్వరుడు. మీరు సాక్షాత్కారం అవడానికి కారణమైన నా గురువే పరబ్రహ్మ అని అర్థం వచ్చేలా కొత్సుడు ఇలా శ్లోకం చెప్పాడు.

**గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః**

**గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురవే నమః**

'అటువంటి గురువుండగా నాకు మీరిచ్చేది ఏముంటుంది?' అన్నాడు. కొత్సుని గురుభక్తికి మెచ్చిన త్రిమూర్తులు అతనిని ఆశీర్వదించి. వెళ్ళిపోయారు.

ఇదీ ఈ శ్లోకం వెనుక ఉన్న కథ..



# గురు కృపాహి కేవలమ్

- రమణ ప్రసాద్

శ్రీబాబు ధ్యానం గురించి బోధ చేస్తూ, “సాధకుడు ముందుగా జిహ్వా చాపల్యాన్ని జయించాలి. ఆ తరువాత వాచా చాపల్యాన్ని జయించాలి. అంటే సాధ్యమైనంత వరకూ మౌనంగా ఉండటానికి ప్రయత్నించాలి. అలా కాకపోతే భగవంతుణ్ణి గురించి మాత్రమే మాట్లాడాలి. అనవసర ప్రసంగాలు మానివేయాలి. దీని ద్వారా శబ్దం శుద్ధి చెందుతుంది. శబ్దంద్వారా ఆకాశం, దానిద్వారా వాయువు శుద్ధి చెందుతాయి. మితాహారం వలన ధ్యానం బాగా చేయగలుగుతావు.

ధ్యానం అంటే ఒక ఉదంతం గుర్తుకు వచ్చింది. ఒకసారి నేను, చిరంజీవి, శేషగిరిరావు, ఇంకా మరికొంతమంది భక్తులు కలిసి పడవలో కొల్లేరులో ప్రయాణం చేస్తున్నాము. కొల్లేరు మధ్యలో ఉండగా పెద్దగాలి వచ్చి అకస్మాత్తుగా నీటి మట్టం పెరిగిపోయింది. మేమంతా ప్రమాదంలో చిక్కుకున్నాము. పడవ మునిగిపోయే పరిస్థితి వచ్చింది. అందరూ ఏడ్పులు మొదలుపెట్టారు. వారిలో కవి పరిమి సుబ్రహ్మణ్యంగారు కూడా ఉన్నారు.

వారందరినీ చూసి నాకు నవ్వు వచ్చింది. వీరందరికీ మరణమంటే ఎంత భయమో! వారికి వెంటనే చెప్పాను ‘మీరేమీ భయపడవలసిన పనిలేదు. మీరు మీమీ స్థానాలలో కూర్చుని నామీద విశ్వాసం ఉంచి కదలకుండా భగవంతుణ్ణి ధ్యానించండి’ అన్నాను. వారందరూ అలాగే కళ్ళు మూసుకుని ధ్యానించారు. కొద్ది క్షణాలలో పడవ ఒడ్డుకు చేరింది. పడవ ఎంత టైమ్‌లో ఎలా ఒడ్డుకు చేరిందో ఎవరికీ తెలియదు. వారి ధ్యాన ఫలితం చూశారా! అదీ ధ్యానమంటే” అన్నారు శ్రీబాబు.

ఇటీవల కాలంలో యిటువంటి సంఘటన మరొకటి జరిగింది. శ్రీమాతాజీ కొంతమంది భక్తులతో కలిసి నేపాల్, కాశీ క్షేత్రాలకు బయలుదేరారు. వారిలో నేను కూడా ఉన్నాను. అది 20 రోజుల యాత్ర. ముందుగా కలకత్తాకు చేరాము. నగరంలో విశేషాలు చూసి, రెండోరోజు నేపాల్‌కు బయలుదేరాము. నేపాల్ చేరాలంటే ఇండియా బోర్డరు రక్సోల్‌లో దిగాలి. అక్కడ నుంచి బస్సు ప్రయాణం చేశాము. నేపాల్ చేరాక పశుపతి నాధుని దర్శనం చేసుకుని అక్కడి సత్రంలో దిగాం. కాని అక్కడ వసతులు సరిగా లేకపోవటం వలన హెూటల్ రూమ్ తీసుకుని అక్కడకు మారాము. ఆ రాత్రి కుమారి ఇందిర వారి పిన్నిగారు ఉన్న రూమ్‌లో దొంగలు పడి ఆవిడ పర్సు దొంగిలించారు. అందులో 11,000 రూ॥లు ఉన్నాయి అని వారు చెప్పారు. మేము పోలీసు రిపోర్టు యిచ్చాము. దొంగ

దొరకలేదు. అక్కడ స్టేషన్ ఇన్‌చార్జ్ 'మీవి 11,000 రూ॥ పోయాయి. కాని పశపతి నాథుని ఆలయంలో ఒకామెవి 60,000 రూ॥లు పోయాయి అన్నారు. ఆ తరువాత ఆ హొటల్ యజమాని ఆమె ఉన్న రూమ్‌కి ఛార్జ్ చెయ్యను. అంతకు మించి ఏమీ యిచ్చుకోలేనని చెప్పాడు. 'ఎక్కడికక్కడే వెంకట లక్ష్మి' అని శ్రీబాబు అనే మాట గుర్తుకు వచ్చింది. ఎందుకంటే పోయినది పదకొండువేలే కదా! అరవైవేలు కాదు కదా! అని.

ఆ మరునాడు పొద్దున్నే బయలుదేరి మాయాదేవి మందిరం దర్శనం చేసుకుని భోజనాలు చేసి నాగర్‌కోట్‌కి బయలుదేరాము. భోజనాలు అయ్యేటప్పటికి ఆలస్యం అయింది. సూర్యాస్థమయ సమయానికి మేమందరం రెండు బస్సులలో బయలుదేరాము. శ్రీమాతాజీ మాతో రాలేదు.

కొండచరియలపై నుంచి ప్రయాణం సాగుతోంది. ఇంతలో చీకటి పడింది. కన్ను పొడుచుకున్నా ఏమీ కనబడటం లేదు. రోడ్డు చూస్తే ఒక బస్సు మాత్రమే వెళ్ళేందుకు అనువుగా ఉంది. ఇంతలో కొండపైనుంచి బస్సు రావటంతో, మా బస్సులు కొండ చివరిగా తప్పుకోవలసి వచ్చింది.

బస్సు డ్రైవర్లు అతి కష్టంమీద బస్సులు నియంత్రించటానికి ప్రయత్నిస్తున్నారు. ఏ మాత్రం స్టీరింగ్ పట్టు తప్పినా లోయలో పడటం ఖాయం. కొండ చరియ చివరిగా వెళ్తూ ఉంటే, టైర్లు కిర్ కిర్ర్ అని శబ్దం చేస్తూ ఉంటే, అక్కడి రాళ్ళన్నీ లోయలోకి పడుతున్నాయి. మా అందరికి గుండె ఝుల్లుమంటోంది.

డా॥స్వర్ణ 'సద్గురుదేవుల నామాన్ని అందరూ బిగ్గరగా అనండి. వేరే విషయాన్ని మనస్సులోకి రానివ్వకండి. శ్రీబాబునే మనస్సులో నిలుపుకోండి' అని అందరిచేత శ్రీసద్గురునామం చేయించారు. అందరి మనసులూ సద్గురుదేవుల పైనే నిలిచిపోయాయి. ఇంతలో మా బస్సులు ఎదురుగా వచ్చే బస్సుకు దారి యిస్తూ నాగర్‌కోట్ శిఖరానికి చేరుకున్నాయి. అక్కడ ఒక పాయింట్ నుంచి చూస్తే ఎవరెస్ట్ శిఖరం బాగా కనిపిస్తుంది. ఎవరెస్ట్ శిఖరం చూసిన తరువాత అందరమూ బసకు చేరుకున్నాము. భక్తులందరూ యీ విషయాన్ని శ్రీమాతాజీకి చెబుదామని వెళ్ళాము. ఆవిడ మేము బస్సు ఎక్కిన దగ్గర నుంచి తిరిగి వచ్చే వరకు ధ్యానంలో ఉన్నారని తెలిసింది. 'అదీ ధ్యాన ఫలితమంటే' అని శ్రీమాతాజీవారు అన్నారు.

# దాన ఫలితం!

– స్వామి రామదాస

ఒక శెట్టికి చాలా ధనం ఉంది. అన్నదాన సత్రాన్ని తన స్వగ్రామంలో ప్రారంభించాడు. అతను స్వార్థపరుడు. అందరూ తనను గొప్ప దానకర్ణుడు అనుకోవాలనే ఆకాంక్షతో ఈ కార్యం మొదలు పెట్టాడు.

జొన్నలు అమ్మే టోకు వర్తకుడు యీ శెట్టి. సంవత్సరాంతంలో మిగిలిపోయి, పురుగులు పట్టి, ముక్కిపోయిన జొన్నల్ని సత్రానికి దానానికి పంపేవాడు. వీటి పిండితో రొట్టెలు చేసి ఆకలిగొన్న వారికి పెట్టేవారు.

శెట్టి కొడుక్కి పెళ్ళయి కోడలు కాపురానికి వచ్చింది. ఆమె సహృదయ, దానశీలి, ధైర్యశాలి, మేధావీను. మామగారి పిసినారితనానికి ఆమె చాలా వ్యథ చెందింది. ఆయనకు గుణపాఠం నేర్పాలనే నిశ్చయానికి వచ్చింది. మామగారికి తనే వండి భోజనం పెడతానంది.

సత్రం నుంచి వాసన వస్తున్న జొన్న పిండి తెప్పించి, మామగారికి మొదటి రోజునే రొట్టెలు చేసింది. మామగారు భోజనానికి కూర్చున్నారు. మిగిలిన వంటకాలతో పాటు వాసనవచ్చే రొట్టెలు కూడా వడ్డించింది. దళసరిగా అందంగా ఉన్న రొట్టెల్ని చూసి, కోడలు తనకోసమేదో ప్రత్యేకమైన పదార్థమేదో చేసి ఉంటుందని తలచి, ముందుగా దాన్నే తినటం మొదలు పెట్టాడు. నోట్లో ముక్క పెట్టుకున్నాడో లేదో తుపుక్కున ఉమ్మేసి, "కోడలా! మన యింట్లో యింత మంచి పిండి ఉండగా, యిలాంటి పిండి నీకెక్కడిదమ్మా?" అని అరిచాడు.

"మామగారూ! నేను మన యింటికి రాగానే, సత్రంలో యిలాంటి రొట్టెలు దానం చేయటం గమనించాను. మనంచేసే దానానికి ఫలితంగా మనకు స్వర్గంలో అలాంటిదే లభిస్తుందని విన్నాను. మీరు అక్కడికి వెళ్ళాక కష్టపడకుండా, మీకు యిప్పటి నుంచే యిలాంటి రొట్టె అలవాటు చేస్తే మంచిదనీ, అప్పుడు ఎక్కువ కష్టపడనక్కర్లేదనీ యిలా చేశాను" అన్నది మేధావంతురాలైన కోడలు పిల్ల.

శెట్టికి కనువిప్పు కలిగింది. సత్రంలో పాడై పురుగులు పట్టిన జొన్నపిండిని అవతల పారవేయించి, మంచి పిండి పంపాడు. ఆ రోజు నుంచి అన్నార్తులకు మంచి మంచి రొట్టెలు దొరికాయి!!


వాసన
ముకుంద్
అయ్యో! నా ఎద్దు జబ్బుపడింది. ఊరెళ్ళడం ఎలా?!
1
దానిదేముంది! నా గానుగెద్దుని తీసుకో, బావా!
2


అయ్యయ్యో! ఈ ఎద్దు
ముందుకెళ్ళకుండా
గుండ్రంగా
తిరుగుతున్నదే!
3


అదా సంగతి?
అయితే నా
మునిసిపాలిటీ
ఎద్దుని తీసుకో,
అన్నయ్యా!
4


అయ్యయ్యో! ఈ ఎద్దు
చెత్త కనపడిన చోటల్లా
ఆగిపోతోంది!
5


నా గంగిరెద్దుని తీసుకో
సామీ!
6


అయ్యయ్యో! ఈ గంగిరెద్దు ప్రతి ఇంటి ముందు ఆగుతున్నదే!
7
చూశారా ఎద్దులు రోజంతా ఏం పని చేస్తాయో, వాటికి అదే వాసన ఎలా అంటుకుందో! అలాగే మనం రోజంతా ఏ ఆలోచనలో ఉంటామో అదే మనకు వాసనగా పట్టుకుంటుంది. అందుకే ఏ పని చేస్తున్నా నిరంతరం భగవన్నామ స్మరణలో ఉండాలి.
8

## కంచిపరమాచార్య

సేకరణ - మురళీ

డా. శివశంకరన్ తను కూర్చున్న బోయింగ్ విమానం కిటికీ నుండి బయటకు చూస్తున్నాడు. చెన్నై కొబ్బరిచెట్లు దగ్గర దగ్గరగా వస్తున్నాయి, కాంక్రీటు భవనాలు కొమ్ములలాగా పైకి మొలుస్తూ కనబడుతున్నాయి. నురుగుతో కూడిన సముద్రపు అలల చివరన ఉన్న తెల్లని మట్టి కనుచూపుమేర కనిపిస్తోంది. "మద్రాసు వదిలి సరిగ్గా ఇరవై సంవత్సరాలయ్యింది" అన్నాడు శివశంకరన్.

"ఎంతగానో మారిపోయి ఉంటుంది" అంది భాగీరథి. "కేవలం సముద్రం మాత్రమే మారలేదు."

భాగీరథి తన చేతిసంచి తెరిచి, దాంట్లో చాలా ఉన్న చిన్న చిన్న సీసాల్లోని ఒక సీసా తీసుకుని, తెరిచి అందులో ఉన్న గులాబి రంగు ద్రావణాన్ని చేతుల్లో వేసుకుని చెక్కిళ్లకు పూసుకుని, కేవలం పది నిముషాల్లో తన వయస్సును తగ్గించేసుకుంది. చిన్నగా దాని పరిమళం విమానం అంతా వ్యాపించింది. "శంకరాచార్యులను చూడడానికి కూడా ఇలా సింగారించుకోవాలా?" అన్నాడు శివశంకరన్.

"కాదు! నా చర్మం ఈ ఎండలను తట్టుకోలేదు" May I have your attention please అని పైనున్న స్పీకరు నుండి ప్రకటన మొదలయ్యింది. తరువాత చెప్పిన విషయం ఏమిటో ఎవరికీ అర్థం కాలేదు. "ప్రపంచంలోనే అత్యంత చెత్త విమానయాన సంస్థగా భారతీయ విమానయాన సంస్థకు ప్రతీ సంవత్సరం బహుమతి ఇవ్వొచ్చు" అన్నాడు శివశంకరన్.

భాగీరథి మౌనంగా ఉండడంతో మరలా తనే, "ప్రపంచంలోనే అత్యంత చెత్త విమానాశ్రయం బాంబే" అని అన్నాడు. భాగీరథి కనుకొనల నుండి అతణ్ణి చూస్తూ, "మొత్తానికి భారతదేశాన్ని దూషించడం మొదలుపెట్టారా?" అన్నది.

"నేను నిజమే చెబుతున్నాను. చెప్పు, ఈ దేశం ఎప్పటికైనా పురోగతి చెందుతుందా? విమానాశ్రయంలో తాగడానికి ఒక్క చుక్క నీరు లేదు. కూర్చుని సేదతీరడానికి ఒక్క కుర్చీ లేదు. అమెరికాలో ఖాయమైన మన టికెట్టు గురించి వారికి సమాచారం రాలేదు అన్నారు.

విమానం మూడు గంటల ఆలస్యం. అస్సలు ఈ దేశానికి విమానం ఎందుకు?" అని శివశంకరన్ రెచ్చిపోయాడు. భాగీరథి మౌనంగా వుండిపోయింది. ఎందుకంటే, వాటికి సమాధానం చెప్పుకుంటూ వెళ్తే ఆ చర్చ ఎక్కడికి వెళ్తుందో తనకు తెలుసు. కానీ శివశంకరన్ తన వ్యంగ్య ధోరణిలో, "కాంచీపురంలో ఏదైనా హొటలు ఉంటుందా, లేక మనం ఆరుబయటే ఉండాలా?" అన్నాడు. భాగీరథి ఏమీ బదులివ్వలేదు. "ఒక అల్యూమినియం పాత్రతో...?" మరలా తను మౌనంగానే ఉంది. విమానం రన్‌వేను తాకి ఒక్కసారిగా కుదుపుకు గురయ్యింది. "ఎంత చెత్తగా దించాడు విమానాన్ని" అన్నాడు శివశంకరన్. విమానం నిలిచిపోయింది. "నీకు అంతగా వెళ్ళాలి అని ఉంటే, నువ్వు ఒక్కదానివే వెళ్ళి దర్శనం చేసుకో! నన్ను ఎందుకు మధ్యలో లాగావు?" "నువ్వు కూడా వారిని చూడాలి".

"నేను ఎందుకు? నాకు ఇలాంటి వాటిపై నమ్మకం లేదు. నేను భౌతికవాదిని, దేవుడు, అతీంద్రియశక్తి లేదని విశ్వసించేవాడిని." తమ సంభాషణను ఈవిధంగా పొడిగించడం ఇష్టంలేక, విషయం వేరేవైపు మరల్చాలని "ఈరోజు ఏం వారం" అని అడిగింది. "భారతదేశానికి వచ్చి, ఈ విమానాల కోసం వేచి చూసిన తరువాత, వారాలు కూడా మర్చిపోయాను." "ఎందుకు ఇంత సమయం తీసుకుంటున్నారు? ఈ జనాలకు ఏరోబ్రిడ్జ్ ఎందుకు?" ప్రయాణీకులందరూ ఆదరాబాదరాగా బయటకు వెళ్ళే ద్వారంవైపు పరిగెత్తారు. "మూడు గంటలసేపు కూర్చుని ప్రయాణం చేశారు. మూడు నిముషాల పాటు కూర్చోలేరా? ఏం భారతీయులో ఏమో!" "నువ్వు భారతీయుడివి కావా?" అని అడగాలనుకుంది భాగీరథి. కానీ తెలివితో విషయాన్ని వేరేవైపు మరల్చింది.

"నువ్వు మొదటిసారి అమెరికా వెళ్లినప్పుడు, నీవద్ద ఎన్ని డాలర్లు ఉన్నాయి?" అని అడిగింది. "రెండు డాలర్లు! కేవలం రెండే డాలర్లు" అది అతనికి అత్యంత ఇష్టమైన విషయం. ఇప్పటికి ఎన్నిసార్లు చెప్పాడో. "కెన్నడి విమానాశ్రయంలో దిగాను. ఒక ఫోన్‌కాల్ చేసుకోవడానికి కావాల్సినంత డబ్బు కూడా లేదు. అప్పుడు నాకు 'కలెక్ట్ కాల్' అంటే ఏంటో కూడా తెలియదు. అప్పుడు నాకు . . ."

- సశేషం

# నారద భక్తి సూత్రములు

(గత సంచిక తరువాయి)

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

భక్తి సూత్రము **1 అథాతో భక్తిం వ్యాఖ్యాస్యామః**

**అథ** - ఇప్పుడు - అన్న శబ్దముతో చాలా గ్రంథాలు మొదలవ్వడం కనిపిస్తుంది. **ఓంకారశ్చ అథ శబ్దశ్చ** అంటూ ఓంకారముతో సమానముగా అథ శబ్దమును పరిగణిస్తారు. **అథాతో బ్రహ్మజిజ్ఞాసా** అని బ్రహ్మసూత్రములు, **అథాతో యోగం వ్యాఖ్యాస్యామః** అని యోగసూత్రములు మొదలవుతాయి. అంతేకాక, అథ శబ్దము పరోక్షంగా గ్రంథ విశేషమును తెలుసుకోవడానికి కావలసిన అధికారమును తెలియజేస్తుంది. మనుష్యత్వము పొంది, ముముక్షత్వమును ఆకాంక్షించడమే



ప్రధానమైన అధికారమైనప్పటికీ, భక్తిసూత్రముల గురించి విచారణ చేయాలన్న ప్రేరణ కలిగి వుండటమే అధికారముగా భావించవచ్చు.

**అతః** అన్న శబ్దము ఆ కారణము చేత అని చెప్పబడుతోంది. గమ్మత్తేమిటంటే ఏ కారణం చేత? అని ప్రశ్నించుకుంటే, పలురకాలైన సమాధానములు ఎవరికి వారికే వర్తిస్తాయి. అన్నిటికంటే ముఖ్య కారణము సమర్థ సద్గురుదేవులను ఆశ్రయించగల అదృష్టము దొరకడమే.

**అథాతో** అంటూ నారదులవారు సాధకుడికి వుండవలసిన సంసిద్ధత నీకు వున్నదా? అని ప్రశ్నిస్తూనే దానిని పెంపొందించుకునే మార్గమును చూపిస్తున్నారు. విశేషమేమిటంటే ఈ భక్తి సూత్రములు సాధనకు అప్పుడే ఉపక్రమించిన వారిని మొదలుకొని సాధనలో ఎంతో అభివృద్ధి సాధించిన వారి వరకూ అందరికీ వర్తిస్తాయి. శ్రీబాబూజీ మహరాజ్‌వారు 'నువ్వు గుంటూరు నుండి విజయవాడకు ప్రయాణిస్తూ మధ్యలో ఆగినప్పుడు మర్నాడు నీ మిగతా ప్రయాణము అక్కడినుండే మొదలవుతుందనీ, గురుదేవులు మాత్రమే జన్మజన్మల నుండీ చేసుకున్న సాధనలో పరిణతిని గుర్తించి ఉద్ధరించగలరనీ' తెలియజేశారు కదా!

సామాన్యముగా భక్తికి అర్హతలేమీ అవసరం లేదనిపించినా నారదులవారు ప్రస్తావిస్తున్న నారదీయ భక్తికి **శుభేచ్ఛ, శ్రద్ధ** అధికారములనీ, అవి లేనిదే భక్తి వృద్ధి చెందదనీ గ్రహించాలి. ఆ భక్తియే భగవంతుని యదార్థ తత్వమును తెలుసుకునే సాధనమని తెలియజేస్తూ గీతాచార్యులు భగవద్గీతలో **భక్త్యా మాం అభిజానాతి యావాన్యశ్చాస్మి తత్వతః** అని శలవిస్తారు.

అటువంటి భక్తి గురించి **వ్యాఖ్యాస్యామః** - వ్యాఖ్యానించు కుందాము అని నారదులవారు తెలియజేస్తున్నారు. బ్రహ్మామానస పుత్రులైన నారదులంతటివారు 'వ్యాఖ్యానిస్తున్నాను' అని కాకుండా, 'వ్యాఖ్యానించుకుందాము' అని తెలియజేయడం ద్వారా గుహ్యంగా భక్తివున్న చోట అహంకారమునకూ, నేను - నాది అన్న భావనకూ స్థానముండరాదన్న సందేశమునిస్తున్నారు. తాను వివరించబోతున్న భక్తిసూత్రములు భగవద్భక్తుల అనుభవ సమాహారములని కూడా తెలియజేస్తున్నారు.

అంతేకాక, భక్తిసూత్రములను చదివి వదిలివేయకుండా ఆచరించి అనుభవములోనికి తెచ్చుకోవాలన్న బాధ్యతను గుర్తు చేస్తున్నారు. ఆ విధంగా సాధకులందరినీ సత్సంగమునకు నారదులు ప్రేరేపిస్తున్నారు. సత్సంగము ఒక్కటే సాధనలో పరిణతి చెందడానికి సహాయపడగల గొప్ప సాధనమనీ, సమయమును సత్కాలములో జమ చేసుకోవడానికి దక్కిన అపురూపమైన అవకాశమనీ శ్రీబాబూజీ మహరాజ్‌వారు బోధించిన విషయము మనందరికీ తెలిసినదే కదా!

ప్రతిజ్ఞా సూత్రముగా పిలువబడే ఈ మొదటి సూత్రము ద్వారా నారదులవారు భక్తి గురించి చర్చించుకోవడానికి కావలసిన అధికారమునూ, సంసిద్ధతనూ తెలియజేస్తున్నారు.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**డిసెంబర్ 2023**

7 గురు: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురుదేవులకు మహాభిషేకము, శ్రీ సద్గురు పాదపూజ, దీపోత్సవం. శ్రీ గురుసాంప్రదాయములో వారికి శ్రీ సద్గురు మహాపుణ్యారాధన

8 శుక్ర: శ్రీ సద్గురు దీక్షలో ఉన్నవారికి హోమం

9 శని: హోమం పూర్ణాహుతి, దీక్షావిరమణ

11 సోమ: మాసశివరాత్రి

12 మంగళ: అమావాస్య

17 ఆది: ధనుర్మాస వ్రత ప్రారంభం - తిరుప్పావై, ఋషులచరిత్ర, భాగవత ప్రవచనం

18 సోమ: సుబ్రహ్మణ్య షష్టి

23 శని: ముక్కోటి ఏకాదశి, గీతాజయంతి - శ్రీమద్భగవద్గీత పారాయణ, ఉత్తరద్వార దర్శనం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

25 సోమ: క్రిస్మస్ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

26 మంగళ: మార్గశిర పూర్ణిమ, దత్త జయంతి - శ్రీ సద్గురు పాదపూజ

**జనవరి 2024**

1 సోమ: ఆంగ్ల సంవత్సరాది - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

6 శని: శ్రీ గురుదశమిం - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

10 బుధ: మాసశివరాత్రి

11 గురు: అమావాస్య

14 ఆది: భోగి పండుగ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, శ్రీ గురుదేవులకు భోగిపళ్ళు పోయుట. భక్త సమారాధన

15 సోమ: సంక్రాంతి పండుగ - ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

16 మంగళ: కనుమ పండగ

19 శుక్ర: శ్రీ రామలక్ష్మీ ప్రసాద మాతాజీ వారి ప్రథమ వార్షిక ఆరాధన - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

25 గురు: పుష్య పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ

30 మంగళ: శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన

# మనశ్శతకము

(గత సంచిక తరువాయి)

పరశురామపంతుల లింగమూర్తి కవి
(తాత్పర్యము: కుమారి సన్నిధానం కాళీమాత)

**33 స్త్రీ వేషధారి పురుషుని, భావము చుమి తలప జీవ భావము వేషా**
**భావమున బురుషు డగుగతి, జీవుడే రాముడగు భ్రాంతి జిమ్మిన మనసా.**

తాత్పర్యము: స్త్రీ వేషములో ఉన్న పురుషునితో చరించిన గాని అంతరంగమందు అతడు స్త్రీ గాదు పురుషుడే అని ఎట్లు భావింతువో, అటులనే ప్రతి జీవి శ్రీరాముడే అని స్థిరముగా నమ్మి చరించుము, భ్రాంతులలో పడకుము మనసా.

**34. అల త్వం పదలక్ష్యార్థము, లలితంబగు తత్పదైక లక్ష్యార్థంబుం**
**దెలిసి యసిపదముతో నిమ్ముల రాముని జూచి పట్టు మొదలని మనసా.**

తాత్పర్యము: "తత్" పద లక్ష్యార్థము 'త్వం' పద లక్ష్యార్థముల నెరిగి "అసి" పదముతో రాముని దర్శించి ఏకాగ్ర చిత్తుడవై ఉండుము మనసా. (తత్త్వమసి అర్థ వివరణము).

**35. సాకారము భ్రమయనియు నిరాకారము శూన్యమనియు ననిశము దన్మ**
**ధ్యాకారము రామునిగా, నేకాలము దలపు రెంటి నెఱుగుచు మనసా.**

తాత్పర్యము: సాకారము అభయమని, నిరాకారము శూన్యమని, ఈ రెంటి నడుమది శ్రీరాముడని ఎరిగి సర్వకాలముల యందు రెండిటిని తెలిసి చరించుము మనసా.

**36. ఘనతనుకరణ ప్రాణము, లనుదిన మెవ్వని ప్రకాశ మనువర్తించు**
**న్మనుకొని యాభద్రాద్రీశుని నిఖిలేశ్వరుని గాగ జూడుము మనసా.**

తాత్పర్యము: శరీరమునందలి అవయవములు, ప్రాణము ప్రతిదినము ఎవరి ప్రకాశమున చలించుచున్నవో ఆ భద్రాద్రీశుని సకలమునకు ఈశ్వరునిగా జూడుము మనసా.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

అందుకని 500 పడవలని ఈ సైన్యం అంతా వెళ్ళడానికి సిద్ధం చెయ్యండి. మీరందరూ కూడా ఒక్కొక్క పడవలో 100 మంది చొప్పున కవచాలు కట్టుకొని, ఆయుధాలు పట్టుకొని నిలబడండి. నేను ఏమి ఎరుగని వాడిలా భరతుడి దెగ్గరికి వెళ్ళి, నువ్వు రాముడిని కలుసుకోడానికి వెళుతున్నావా, రాముడిని సంహరించడానికి వెళుతున్నావా అని అడుగుతాను. ఒకవేళ రాముడిని సంహరించడానికే భరతుడు వచ్చి ఉంటే, పడవలలో గంగని దాటిస్తామని చెప్పి, పడవ ఎక్కించి, గంగ మధ్యలో ముంచేద్దాము. ఒకవేళ రాముడిని కలుసుకోవడానికే భరతుడు వచ్చి ఉంటే, రాముడు ఎక్కడున్నాడో చెప్పి, వాళ్ళతో నేను కూడా వెళతాను" అన్నాడు.

అప్పుడాయన కొంత మాంసము, పుష్పములు, ధాన్యములు, కందమూలములు, తేనె పట్టుకొని భరతుడు విడిది చేసిన గృహం దగ్గరికి వెళ్ళాడు. గుహుడు రావడాన్ని చూసిన సుమంతుడు లోపలికి వెళ్ళి భరతుడితో "భరతా! నువ్వు రాముడు ఎక్కడున్నాడో అని వెతుకుతున్నావు కదా, రాముడు ఎక్కడున్నాడో గుహుడికి తెలుస్తుంది. రాముడికి గుహుడి మీద అపారమైన ప్రేమ, అలాగే గుహుడికి రాముడి మీద అపారమైన భక్తి" అని సుమంతుడు భరతునికి గుహుని చూపి పరిచయము చేశాడు. భరతుడు గుహుని పాదములకు వందనమొసగాడు.

గుహుడు తాను తీసుకువచ్చిన వాటిని అక్కడ పెట్టి "నువ్వు ఈ రాజ్యాన్ని దశరథ మహారాజుగారి వల్ల పొందావు, ఇంకా నీ తృప్తి తీరక రాముడిని చంపుదామని వచ్చావా? లేకపోతే రాముడిని కలుసుకుందామని వచ్చావా? నాకు మనస్సులో శంకగా ఉంది. నిజం చెప్పు భరతా, ఎందుకు వచ్చావు ఇక్కడికి" అని అడిగాడు.

అప్పుడు భరతుడు "నువ్వు అన్నమాట వలన నాకు బాధ కలిగినా, నీ అమాయకత్వం నాకు తెలుస్తోంది. నేను ఈ గంగ దాటి భారద్వాజ ఆశ్రమానికి వెళ్ళి, ఆ ఆశ్రమం దగ్గరలో ఉన్న రాముడిని కలుసుకోవాలని

అనుకుంటున్నాను" అన్నాడు. "సరే నువ్వు రాముడిని కలుసుకోవాలని వచ్చావు, మరి నీ వెనకాల ఇంత సైన్యం ఎందుకు వచ్చింది?" అని గుహుడు భరతుడిని ప్రశ్నించాడు.

అప్పుడు భరతుడు ఆకాశమంత నిర్మలమైన మనసుతో "ఒక తమ్ముడు ఒక అన్నగారిని రాజ్యం కోసం చంపేటటువంటి దురాలోచన ఎన్నడూ రాకుండుగాక, ఒక తమ్ముడు అన్నగారి గురించి ఎప్పుడన్నా ఆలోచిస్తే, అన్నగారి కాళ్ళుపట్టి నమస్కరించడానికి మాత్రమే ఆలోచించేటటువంటి సౌజన్యము నిలబడుగాక" అన్నాడు.

ఈ మాటలు విన్న గుహుడు "ఇక్ష్వాకు వంశంలో పుట్టిన నీకే చెల్లిందయ్యా ఈ మాట చెప్పడం. నాకు చాలా సంతోషంగా ఉంది. మీ ఇద్దరూ కలిస్తే, చూసి మురిసిపోవాలని ఉంది, దగ్గరుండి గంగని దాటించి నేను మీతో వస్తాను. రాముడు ఇక్కడే పడుకొని వెళ్ళాడు, నన్ను తన తల మీద మర్రి పాలు పోయమన్నాడు, జటలు ధరించి, నార చీరలు కట్టుకొని వెళ్ళాడయ్యా రాముడు" అని అన్నాడు.

పట్టాభిషేకమొనరించుకుని రాజ్యమేలవలసిన రాముడు, సీత మరియు లక్ష్మణుడు ముగ్గురూ ఎలా అరణ్యవాసము చేయుచున్నారని ప్రశ్నించిన భరతునికి, "నీలిమేఘశ్యామ తిరుమేనిగల రాముడు, సీత మరియు లక్ష్మణుడు చేతులలో విల్లంబులు బుచ్చుకుని తమ ప్రాణములను కాపాడుకొనుచున్నారు" అని ఇలా వివరించాడు గుహుడు.

- సశేషం



# నిర్మల భక్తి

- ఎన్. కుట్టి

అది ఒక కుగ్రామం. ఆ గ్రామంలో ఒక శివాలయం ఉంది. ఆ ఊరివారంతా గుడికి వచ్చి మహాదేవునికి పూజార్చనలు పంచామృతాలతో, ఫలరసాలతో అభిషేకాలు చేసికొనేవారు. శివునికి పట్టు వస్త్రములు సమర్పించుకునే వారు. తదుపరి వారు చేసి తెచ్చిన పదార్థములను, ఫలములను నైవేద్యం పెట్టేవారు. అర్చకులవారు దేవదేవునకు మంగళ హారతులిచ్చి. భక్తులకు తీర్థ ప్రసాదాలనిచ్చి పంపేవారు.

ఆ ఊరిలో ఒక పేదరాలు ఉండేది. ఆమెకు ఎవ్వరూ తోడు లేరు. ముదుసలి. శివాలయం పంచలోనే ఉంటూ తన జీవితాన్ని గడిపేది. శివుడంటే ఆమెకి ఎనలేని భక్తి. భక్తులు పూజలు, అభిషేకాలు చేస్తుంటే, తానే స్వయంగా చేస్తున్న ఆనందాన్ని పొందేది. పూజారి ప్రతిరోజూ కొంత ప్రసాదమును, కట్టుకొనుటకు వస్త్రములను ఆమెకు ఇచ్చేవాడు.

తెల్లవారుజామున పరమశివునకు మేలుకొలుపు జరిగేది. ఆ తరువాత అర్చకస్వామివారు శివుని అర్చన చేసేవారు. క్రమక్రమంగా భక్తులు వచ్చి కానుకలు సమర్పించుకుని శివునికి అర్చనాభిషేకాలు చేయించుకుని తీర్థ ప్రసాదాలను తీసికొని ఇండ్లకు మరలిపోయేవారు.

ఉదయాననే ఈమె దేవాలయానికి వచ్చి శివునికి ఎదురుగా కూర్చుని అర్చకస్వామి చేసే పూజాభిషేకములను తన్మయతతో గమనిస్తూ, మైమరచిపోయేది. శివునికి జరిగే షోడశోపచారములు తానే చేస్తున్న అనుభూతి చెందేది. ఆమె ఇలా భావించేది: "హే మహేశా! నాకు ఎంతటి అదృష్టాన్ని ప్రసాదించావయ్యా! నీవే నాకు తల్లివి, తండ్రివి. నా సర్వస్వము నీవే. నీవే నా దైవము. నీ పదములనే సేవిస్తాను. ఎల్ల వేళలా నీ నామమే తలుస్తాను. అందరూ పూమాలలతో నిన్ను అలకరిస్తుంటే నేను నీకు నా మనోపుష్పాలతో దండ చేసి నా హృదయేశ్వరుడవైన నీకు వేసి తృప్తి చెందుతాను.

భక్తులు కాశీనుండి నీరు తెచ్చి నీకు అభిషేకము చేస్తే, నేను గలగలా పారే స్వచ్ఛమైన నదీ జలాలతో అభిషేకిస్తున్నాను. నీకు ప్రీతికరమైన పిండివంటలు నేను సంకల్పించి చేసి నీకు నైవేద్యము పెడుతున్నాను. నేతి వత్తులతో హారతులనిస్తున్నాను. నా సర్వస్వమును

నీకు అర్పణ చేసి సాష్టాంగ ప్రణామం చేస్తున్నాను. నాకు మరు జన్మ లేకుండా చేసి నన్ను నీలో చేర్చకో తండ్రీ!

**పాట పాడనా ప్రభూ పాట పాడనా!**

**నీ పదమే నా పదమై పాట పాడనా ॥ ప్రభూ! పాట పాడనా॥**

1. **గంగ ఉదకములు నేను నీకు తేలేనయ్యా**

**పూల మాలలు తెచ్చి వేయలేనయ్యా,**

**పట్టు వస్త్రములు నీకు కట్టలేనయ్యా,**

**నా మనసే నీకు అంబరముగా చేసెదనయ్యా**

**॥ప్రభూ! పాట పాడనా॥**

2. **కన్నీటితో నీ పాదములు కడిగెదనయ్యా**

**అనవరతము నీ ధ్యానమె చేసెదనయ్యా**

**నా మనమున నీ నామమె తలచెదనయ్యా**

**కరుణించి కాపాడుము దేవ దేవా**

**॥ప్రభూ! పాట పాడనా॥**

**" నేను చేయగలిగినది ఒక్కటే.**

**నా హృదయంలో నీ రూపము నిలిపి ధ్యానించటమే.**

**కన్నుల మెదిలే నీ నగు మోము**

**వెన్నెలలు కురిసే నీ చిరు నవ్వులు**

**చూసే భాగ్యమునీయవయ్యా**

**మోయలేను ఈ జీవిత భారము**

**నన్ను నీలో చేర్చవయ్యా! "**

అని అహర్నిశలు శివుని వేడుకొనేది.

ఒక రోజున అర్చకస్వామి వచ్చి ఆలయ తలుపులు తెరిచాడు. రోజూ వచ్చే ఆ వృద్ధురాలు కనిపించలేదు. ఆతురతగా వెదికాడు. శివాలయంలో ఒక పంచన పడుకొని ఉండటం చూసి పలకరించ బోయాడు. ఆమె పలుకలేదు. శివుని గాంచిన ఆనందపు రేకలు ఆమె వదనంలో ప్రకాశిస్తున్నాయి. ఆమె కైవల్యాన్ని పొందినది.

(గత సంచిక తరువాయి)

# బిచ్చగాడు

'అర్థమైంది మరి చెప్పొద్ద'న్నాడు బిచ్చగాడు. ఎందుకు? ఈ జన్మలో కూడా ఇవ్వడానికి నాదగ్గర ఏమీ లేదు కాబట్టి వచ్చే జన్మ కూడా... అని గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు. మర్నాడు అదే సమయానికి ఆ బిచ్చగాడు పండితుని ఎదురుగా నిలబడి 'ఇందులోంచి బయటపడే మార్గం ఏమీ లేదా? నేనిలాగే జన్మజన్మలకు బిచ్చగాడిగానే ఉండిపోవాలా?' అని అడిగాడు. జ్ఞానం, సమయం, వ్యక్తిత్వ విలువలు తెలిసిన పండితుడు 'ఇలా కూర్చో' అన్నాడు. 'పెద్దవారు, మీదగ్గర నేను కూర్చోవడమా' అన్నాడు. 'పర్వాలేదు కూర్చో. జిజ్ఞాసా పరులకు శాస్త్రం చెప్పొచ్చు, చెప్పాలి కూడా. అందుకే ఈ శాస్త్రాలన్నీ' అన్నాడు. కూర్చున్నాడు బిచ్చగాడు. 'ఇప్పటికైనా దానం చేయడం మొదలుపెట్టాలి' అన్నాడు. 'నేను దానం ఎలా చేస్తాను? నాదగ్గర ఏముంది గనుక?' 'అన్నీ ఉన్నాయి లేకపోవడమనేది లేదు. నీలో దానగుణం ఉంటే చాలు. నీ దగ్గర వున్నదే దానం చెయ్యి. ఈరోజునుంచి నీ కడుపుకి ఎంత కావాలో అంత మాత్రమే బిచ్చమెత్తుకుని అందులో సగం దానం చేస్తుండు. తనకు అవసరమున్నాసరే అందులోంచి మిగిల్చి ఇవ్వడమే దానం తాలూకు ముఖ్యోద్దేశ్యం. తను వాడుకోగా మిగిలినది ఇవ్వడం కాదు.'

బిచ్చగాడికి విషయం అర్థమైంది. వెంటనే ఆరోజునుంచి ఓ నియమం పెట్టుకున్నాడు. తనకి ఎంత అవసరమో అంతే అడుక్కుని అందులోంచి సగం దానం చేయాలి. ఇది ఎలా తెలుస్తుంది దాని కోసం తన చేతిని భిక్షాపాత్రగా చేసుకుని అందులో పట్టినంత మాత్రం తీసుకుంటూ అందులో సగం దానం చేస్తూ సగం మాత్రమే తిన్నాడు. దాంతో బిచ్చగాడికి బిచ్చమెత్తుకునే ఇళ్ల సంఖ్య తగ్గిపోయింది. తిరగడం కాలం కూడా తగ్గిపోయింది. అతనికి ఒక గుర్తింపు లాంటిది వచ్చింది. కొద్ది రోజుల్లోనే ఇతను ఎవరి దగ్గర పడితే వారి దగ్గర బిచ్చమెత్తుకోడు ఇతను మన ఇంటికొస్తే ఈ రోజు బాగుణ్ణు. అనేటటువంటి భావాలు జనాల్లో కూడా వచ్చాయి.

అంతేకాదు మొన్న వాళ్ళింటికెళ్ళాడు. నిన్న వీళ్ళింటికి వచ్చాడు. ఇవాళ మనింటికి తప్పకుండా వస్తాడని వాళ్ళు ఆ బిచ్చగాడి కోసం మరికొంచెం పవిత్రంగా ఇవ్వాల్సిన పదార్థాల్ని సిద్ధం చేసేవాళ్లు. అందరికీ ఇచ్చే బిచ్చంకంటే ఇతనికి వేసే బిచ్చం చాలా ప్రశస్తంగా ఉండేది. సాత్వికంగా ఉండేది. మంచి ఆహారం లభించేది.

పుచ్చుకున్న దాంట్లో ఇతడు దానం చేయడం అందరూ చూశారు. అతనిలో ఏదో గొప్పతనం ఉందని చెప్పి పది మంది బిచ్చగాళ్లు చుట్టూ చేరి నువ్వే మా

గురువన్నారు. ఇతడికది అంగీకారం లేదు. ఇదే నియమం పెట్టుకుని నేనెందుకు కాశీ వెళ్ళిపోకూడదు అని అనిపించింది. బయలుదేరాడు వెడుతున్నప్పుడు కూడా ఇదే నియమాన్ని పాటించాడు. తన చేతుల్లో ఎంత పడితే అంత ఆహారం తీసుకోవడం, అందులోనున్న సగం దానం చేయడం. మిగిలినదే తినడం. అంటే అర్థాకలిని, తన ఆకలి కడుపుని భగవదర్పణంగా జీవనం సాగిస్తున్నాడు. మొత్తం మీద కాశీ పట్టణాన్ని చేరాడు. అతను ఇదే నియమాన్ని అక్కడ కూడా పాటిస్తూ ఓ చెట్టు కింద ఎక్కువసేపు కూర్చునేవాడు. ఆతడు అందరిలాగా ఒక అరగంట కూర్చుని ఏదో వస్తే తీసుకుని వెళ్లిపోవడం ప్రసక్తి లేదు. లేదా సాయం చేయండి, ధర్మం చేయండి, దానం చేయండి వంటి మాటలు కూడా అతని నోట ఎప్పుడూ వినిపించేవి కాదు. ఎప్పుడూ ఏదో ఒక ధ్యానంలో ఉంటూ ఉండేవారు. అతని దగ్గర పడిన డబ్బులు, లేదా బియ్యం ఇవన్నీ కూడా ఆతను వెళ్ళాక ఎవరో తీసుకునే వాళ్లే తప్ప అతడు ఏనాడు అవి ఆశించలేదు.

ఇలా కొన్నాళ్ళు గడిచేసరికల్లా అతని మీద పదిమంది దృష్టి పడింది. అతనొక సాధకుడని, కారణ జన్ముడనీ, అతనికి ఏం చేసినా మంచి జరుగుతుంది అని చెప్పి అతని పేరుతో ఒక వేద పాఠశాల, ఒక సత్రం కూడా నిర్మించారు. ఆ సత్రం పేరు కరపాత్ర సత్రము. అతని పేరును కరపాత్ర స్వామీజీ అని ప్రజలే ఆ పేరు పెట్టారు. కరమే పాత్రగా కలిగినటువంటి వాడు అని పేరుపెట్టారు. ఇలాగ వేదవిదులు వేదాభ్యాసం చేస్తున్నారు. పిల్లలకు వేదం శాస్త్రం పురాణం ఇతిహాసాలు చెప్తున్నారు. సత్రాల్లో బస చేస్తున్నారు. వచ్చే పోయే వాళ్ళు కూడా భోజనం చేస్తున్నారు. కానీ ఇతనికీ విషయాలు ఏవీ తెలియవు. ఇతడు మాత్రం రోజూ నదికి వెళ్ళి స్నానం చేసి ధ్యానం చేయడం, మధ్యహ్నం బిచ్చమెత్తుకోవడం తనకు వచ్చిన దాంట్లో సగం దానం చేస్తుండటం యథాతథంగా జరుగుతోంది. కొన్నాళ్లయిన తర్వాత అక్కడ అతని దగ్గర కూర్చునేవారు, నిలబడేవారు చూసేవారు, దండం పెట్టుకునేవారు పెరిగారు. వారి కోసం అన్నట్టుగా అక్కడ నీడని కల్పించడం, పందిళ్ళు వేయడం మొదలుపెట్టారు. పెద్ద తీర్థయాత్రగా మారిపోయింది. ఇంకొన్నాళ్ళ తరువాత ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తూ ఈయన్ని పెద్దగా పిలవాలని అనిపించి, ఆ సభ బాధ్యత అంతా వాళ్ళే భరిస్తూ కరపాత్ర స్వామీజీని పిలిచారు. అందులో మాట్లాడుతున్న పెద్దవాళ్ళందరూ ఈయన 15 ఏళ్ళుగా తెలుసు. వీరిని చూసిన తరువాత నాలో చాలా మార్పు, అంతేకాదు కొన్ని కుటుంబాలు వాళ్ళయితే మేమీయనకి దండం పెట్టిన తర్వాత మొక్కుకున్న తర్వాత మా పిల్లకి పెళ్ళి అయిందన్నవారు, మాకున్న అప్పులన్నీ తీరాయి, కష్టాలు తీరాయి

అన్నవాళ్ళు మాకు ఏ ఇబ్బందులు లేకుండా అయిపోతున్నాయి. పరమేశ్వరుని దర్శిస్తే ఎంత పుణ్యమో అంత పుణ్యమూ వీరిని దర్శిస్తే నాకు జరిగిందని ఇలా అనేక రకాలుగా చెబుతున్నారు.

\- సశేషం

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**డిసెంబర్ 2023**

3 ఆది: శ్రీ గురుదేవులు స్వస్వరూపలయం చెందిన తేదీ - ఉ.11.00 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

7 గురు: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

17 ఆది: ధనుర్మాస వ్రత ప్రారంభం

18 సోమ: సుబ్రహ్మణ్య షష్టి - సా.5.30 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

23 శని: ముక్కోటి ఏకాదశి, గీతాజయంతి - సా.5.30 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

25 సోమ: క్రిస్మస్ - సా.5.30 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

26 మంగళ: మార్గశిర పూర్ణిమ, దత్త జయంతి - సా.5.30 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

**జనవరి 2024**

1 సోమ: ఆంగ్ల సంవత్సరాది - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

6 శని: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

14 ఆది: భోగి పండుగ - ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం ఉ.11.00 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, శ్రీ గురుదేవులకు భోగిపళ్ళు పోయుట. భక్త సమారాధన

15 సోమ: సంక్రాంతి పండుగ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

25 గురు: పుష్య పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీకొండ ఈశ్వరరాజుగారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

అప్పటికి ఈశ్వరరాజు గారికి పూజలు, పునస్కారాలతోగాని, ఆధ్యాత్మిక విషయాలతో గాని, యేమీ పరిచయం లేదు, ఆసక్తీ ఉండేది కాదు. వారి అన్నగారు వారితో "నాయనా! నువ్వు ఏ పని చేస్తున్నా 'నారాయణా' అని స్మరించుకుంటూ ఉండు. ప్రతి రోజూ ఉదయం స్నానం చేయగానే నుదుట కుంకుమ ధరించు" అని చెప్పిన ఆదేశమును మాత్రం క్రమం తప్పక పాటించే వారు. అటువంటి వారి చేతికి ఆ విధంగా భగవద్గీత పుస్తకం అందేటట్లు చేసి, ఆధ్యాత్మిక జిజ్ఞాస అనే బీజాన్ని వారి మనస్సులో నాటారు శ్రీ బాబు.



ఆ పుస్తకం కొనుక్కున్న క్షణం ఎటువంటిదో గాని, అప్పటి నుంచి ఈశ్వరరాజు గారిలో "ఇలా హస్త భూషణంగా భగవద్గీతను పెట్టుకోవటం కంటె, దాని విశేషమేదో గట్టిగా తెలుసుకోవాలి" అనిపించింది. ఆ యాత్ర నుండి తిరిగి వచ్చిన వెంటనే ఈశ్వరరాజుగారు ఒక పండితుణ్ణి కొన్ని రోజుల పాటు తమ యింట్లో పెట్టుకొని గీతాధ్యయనం చేశారు. ఆ విధంగా శ్రీ బాబు వారిలో ఆధ్యాత్మిక జిజ్ఞాసను వృద్ధి పొందించారు.

**1961** సంవత్సరంలో అష్టగ్రహ కూటమి సంభవించింది. ఆ సందర్భంలో గ్రహశాంతి కొరకు , సర్వారిష్ట నివారణ కొరకు, శ్రీ బాబు ఆశీస్సులతో ఈశ్వరరాజుగారు సప్తాహ్నిక దీక్షతో, నిత్య జప హోమార్చనాదులతో పాటు అఖండ భగవన్నామ సంకీర్తన, అఖండ

భగవద్ధ్యానము, శ్రీ బాబు దివ్యబోధతో కూడిన సత్సంగ సమావేశాలు నిర్వహించారు. ఆ విధంగా వారికి శ్రీ బాబుతో సాన్నిహిత్యం ఏర్పడింది.

**1962**లో శ్రావణమాస ప్రారంభంలో ఒక రోజు శ్రీబాబు గుండుగొలను వస్తున్నారని కబురు తెలిసి ఈశ్వరరాజుగారు శ్రీ బాబును తమ యింటికి విచ్చేయవలసినదిగా ప్రార్థించారు. శ్రీ బాబు వారి అభ్యర్థనను మన్నించి వారింటికి వెళ్ళారు. ఆ సందర్భంగా వారింట్లో సత్సంగ సమావేశము ఏర్పాటు చేశారు.

ఆ రోజు శుద్ధ తదియ. సత్సంగ సమావేశంలో ప్రార్థనానంతరం శ్రీ బాబు "ఈ రోజు తిథి ఏమిటి?" అని అడిగారు. బందా తాతయ్యగారు 'తదియ' అని చెప్పారు. "ఆ తిథి ప్రాముఖ్యత ఏమిటి?" అని శ్రీ బాబు మళ్ళీ అడిగారు. తారకంగారు శుద్ధ తదియ నాడు నెలపొడుపు - అంటే చంద్రదర్శనం అవుతుంది బాబూ" అన్నారు. దానిని పురస్కరించుకొని శ్రీ బాబు తమ దివ్య బోధను అందించారు.

"అమావాస్య నాటి రాత్రి కటిక చీకటియే గాని, చంద్ర దర్శనమే కాదు. విదియ నాడు కూడా కనబడని చంద్రుడు తదియనాడు దర్శనమిస్తాడు. ఆ నెలలో అదే చంద్రుని ప్రథమ దర్శనం గనుక 'నెల పొడుపు' అంటారు. ఆనాడు చంద్రుడు చాల సన్నగా, దారపు పోగువలె రేఖా మాత్రంగా కనిపిస్తాడు. కాంతి కూడా చాల తక్కువగా ఉంటుంది.

- సశేషం

## విష్ణు  కథలు

(గత సంచిక తరువాయి)

-రమణ ప్రసాద్

# సమర్థ రామదాసు

"లోపల దున్నపోతు తరిగి వండుతున్నాడు. పైకి పెద్ద పెద్ద మాటలు మట్లాడుతున్నాడు" అనుకున్నాడు శివాజీ. ఆకులు వేసి వడ్డించారు."స్వామీ! ప్రసాదం స్వీకరించండి" అన్నాడు రంగోబా. "సరే! తప్పుతుందా?" అన్నారు సమర్థులు. శివాజీ వైపు చూసి, "ఇక్కడ నేను భోజనం చేసి భ్రష్టుడనవు దామనుకుంటున్నాను. మీకు ఇష్టమైతే మీరూ భోజనం చేయవచ్చు" అన్నారు సమర్థులు. "రంగోబా! వాకిట్లో శవాన్ని పెట్టుకుని భోజనం చేయటం నాకు ఇష్టం లేదు. దానిని పడేసి రా" అన్నారు. 'ఆజ్ఞ!' అంటూ రంగోబా రామనామాన్ని ఉచ్ఛరించి దానిపైన నీళ్ళు చల్లారు. అది లేచి తచ్చాడటం మొదలు పెట్టింది. ఇదంతా ఏమిటో శివాజీకి బోధ పడలేదు. చూస్తే అక్కడ వడ్డించింది దున్నపోతు మాంసం కాదు. షడ్రసోపేతమైన మృష్టాన్న భోజనం.

సమర్థులు శివాజీతో, "చూశావా! రంగనాధుడి గురుభక్తి! అతని పై పై వేషం చూసి మోసపోయావయ్యా. నిజమైన మహాత్ములను నీవు గుర్తించాలని నేను ఈ ఏర్పాటు చేశాను. మహాత్ముల పై పై వేషాలను చూసి వారిని నిరాదరణ చేయకూడదని అలా చేశాను. సాధువులు ఏ వేషంలో వచ్చినా వారికి నమస్కరించు. వారిని గౌరవించు" అన్నారు సమర్థులు.

ఒకసారి సమర్థులు మహాబలేశ్వర్ లో ఉండగా శివాజీపై పరమానుగ్రహం కలిగి, శివాజీకి గురుతత్త్వం బాగా బోధపడాలని సంకల్పించారు. "నేను అలా వెళ్తున్నాను, రాత్రికి రానేమో" అన్నారు కళ్యాణ్‌తో. "శివాజీ వస్తే ఏమని చెప్పాలి? అన్నాడు. నేను అడవులలోకి వెళ్ళిపోయానని, ఎప్పుడు వస్తానో తెలియదని చెప్పు" అన్నారు.

సమర్థులు వెళ్ళిన కాస్సేపటిలోనే శివాజీ వచ్చారు. సమర్థులు లేరన్న వార్త శివాజీని నిరుత్సాహపరిచింది. శివాజీ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "నేను ఆయన కోసం కాచి ఉండచ్చా?" అన్నారు. "మీ ఇష్టం" అన్నాడు కళ్యాణ్. సూర్యాస్తమయం కావస్తున్నది. సమర్థుల అన్వేషణకై సైనికులతో బయల్దేరారు శివాజీ. "గురుదేవా!" "గురుదేవా!" అని అరుస్తూ వెతుకుతున్నారు. ప్రార్థనా సమయానికి ఒక చిన్న నీటి మడుగులో స్నానం చేసి మానసిక పూజ, గురుమంత్ర జపం ముగించుకుని మళ్ళా వెదకటం మొదలు పెట్టాడు శివాజీ.

అర్ధరాత్రి సమయం ఓ పెద్దపులి గాండ్రిపు వినిపించింది. ఇంతలో ఎవరో మూలుగుతున్నట్లు వినిపించింది. "అమ్మా జగన్మాతా! ప్రభూ! శ్రీరామా! ఈ బాధనుండి విడిపించండి" అని. అది సమర్థుల గొంతే. సమర్థులు కడుపునొప్పితో, ఆర్తనాదం చేస్తూ ఒక బండపై దొర్లుతున్నారు. శివాజీ ఆయన శిరస్సును తన ఒడిలో పెట్టుకుని "ఎందుకిలా బాధపడుతున్నారు? ఏమైంది?" అని అడిగాడు.

"ఎవరు? శివాజీ మహారాజా?" అన్నారు అంత బాధలోనూ స్వామి. "శివ" అనండి చాలు అన్నాడు శివాజీ. "దీనికి ఏదైన మందు ఉందా? వుంటే చెప్పండి, తీసుకొని వస్తాను" అన్నాడు శివాజీ. "ఆ మందు అత్యంత దుర్లభమైనది. దానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది. బహుశః ప్రాణాలే పోవచ్చు. ఈ కడుపు నొప్పికి అదొక్కటే మందు" అన్నారు. "మీరు చెప్పండి, ఎంత అసాధ్యమైనా తెచ్చి మీ పాదాల ముందు ఉంచుతాను" అన్నాడు శివాజీ.

"దానికి మందు పులి పాలు. అది చాలా కష్టం" అన్నారు సమర్థులు. "నేను ఇప్పుడే వెళ్ళి తెస్తాను" అని బయలుదేరాడు. చీకటి గుహలో నాలుగు కళ్ళు మెరుస్తున్నాయి. అవి చిన్న పులిపిల్లలు. అంటే వాటి తల్లి దగ్గరలోనే వున్నదన్న మాట. పులి గాండ్రింపు వినిపించింది. తన పిల్లల దగ్గర ఎవరో వున్నట్లు చూసి శివాజీ పైకి దూకింది.

- సశేషం

## శ్రీ కాళీ వనాశ్రమ శాఖ, భీమవరము,
## పశ్చిమ గోదావరి జిల్లా (ఆం.ప్ర)

**భవన నిర్మాణము**

సమర్థ సద్గురుదేవులు శ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారు లోక కళ్యాణం కొరకై ఎన్నో చోట్లకు వెళ్ళి ఎందరో భక్తుల ఆర్తిని బాపిన అవతార పురుషులు. వారు నడయాడిన ఊరు భీమవరము మరియు ఆ చుట్టు ప్రక్కలనున్న యనమదుర్రు, దిరుసుమర్రు మొదలగు గ్రామములు. శ్రీ స్వామివారు మహా ప్రస్థానం పొంది 35 సంవత్సరములు అయినవి. ఇచ్చటి భక్తులందరూ చేరి భీమవరం-ఉండి రోడ్డున దాతలు ఇచ్చిన స్థలములో బృందావనము, దాని ప్రక్కన అన్నదాన శాల, వసతి గృహము నిర్మింప సంకల్పించినారు. ఈ భవన శంకుస్థాపన శ్రీ కాళీవనాశ్రమ పీఠాధిపతి యోగిని శ్రీచంద్ర కాళీ ప్రసాద మాతాజీవారు, ది.10-05-2023 తెల్లవారు జామున 3.24 గం.లకు చేశారు.

ఈ సందర్భమున భక్తులకు చేయు విన్నపమేమనగా, మీరెల్లరూ ఉదార స్వభావముతో ముందుకు వచ్చి త్వరలో ఈ భవన నిర్మాణము పూర్తియగునట్లు తమ సహాయ సహకారములను ధన రూపేణ, వస్తు రూపేణ అందించమని ప్రార్థించుచున్నాము.

విరాళములు ఈ క్రింది బ్యాంక్‌కు పంపవలెను.
Sri Sri Sri Hanumat Kali Vara Prasad Babu Trust
Bank of Baroda, Nambur Branch
S/B Account No : 69900 1000 00 172
IFSC : BARB0DBUNAM (5th character is 'zero')
Contact Numbers
Murali : 93983 34345
Tummalapalli Siva : 96181 99556

**భక్తులు ఒసగు విరాళములకు ఐ.టి యాక్ట్ 80జి క్రింద పన్ను రాయితీ లభించును.**

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

# ధ్యానాగ్ని దగ్ధ కర్మాణి



అది ఒక సమర్ధ సద్గురువులైన శ్రీ సత్యానంద స్వామి మహరాజ్ వారి ఆశ్రమం. ఆయన దగ్గర ముగ్గురు శిష్యులు ఉండేవారు. అన్ని విద్యలతో పాటు రోజూ భగవద్గీత పాఠం చెప్పేవాడు. ఒకరోజు వారిని పరీక్షింపదలిచాడు. వారిని పిలిచి తలా ఒక బొగ్గు ముక్క ఇచ్చి "ఇందులో ఒక తెల్లని పదార్థం ఉంది. దానిని వెదికి తీసుకొని రండి" అని ఆదేశించాడు. ఒక శిష్యుడు ఆ బొగ్గుని అన్ని పవిత్ర నదీ జలాలతో శుద్ధం చేశాడు. లాభం లేకపోయింది. బొగ్గు ముక్క నల్లగానే ఉంది. రెండవ వాడు నమక చమకాలు చదువుతూ పంచామృతాలతో, గంగా జలాలతో అభిషేకించాడు. ఉహూ! బొగ్గు ముక్క నల్లగానే ఉంది.

మూడవ శిష్యుడు ఆలోచించాడు. అతనికి గురువుగారు చేసిన బోధ గుర్తుకు వచ్చింది. "ఎవరి కర్మలు సంకల్పాలు జ్ఞానమనే అగ్నిలో దహించి వేసుకుంటాడో అతడే నిజమైన పండితుడు (జ్ఞాని)" అని భగవానుడు భగవద్గీతలో చెప్పారని" గురువుగారు పాఠంలో చెప్పారు. ఆ తరువాత ఇంకా వివరిస్తూ, "మీ గురువు ధ్యానాగ్ని దగ్ధ కర్మాణి" అని చెబుతున్నాడు. మాటలు వేరైనా అర్థం ఒకటే" అని. వెంటనే ఆ బొగ్గుముక్కకి అగ్ని సంస్కారం చేశాడు. అది స్వచ్ఛమైన తెల్లని పదార్థంగా మారింది. దానిని తెచ్చి గురువుగారికి ఇచ్చాడు.

గురువుగారు పరమానంద భరితులయ్యారు. "నా శిష్యుడు నేను బోధించిన దానిని ఇంత బాగా గ్రహించాడా! ఆహా! నా శిష్యుడు నేను చెప్పినవన్నీ ఇంత చక్కగా నేర్చుకున్నాడా" అని లోలోనే ఆనందించాడు. ఆ ఇద్దరి శిష్యులను భగవద్గీతను భావార్థాలతో ఇంకా బాగా చదవమని సూచించారు.

శ్రీ బాబూజీ మహరాజ్ వారు తమ బోధలో భక్తులకు వివరించిన ఈ కథ చిరస్మరణీయగా నిలిచిపోయింది.

REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on 5th and 6th of every month.

RNI No.: 37804/1981
Postal Regd. No. : GTR/27/2021-2023



సెప్టెంబరు 7,
కృష్ణాష్టమినాడు కర్తలచే
శ్రీసద్గురు పాదపూజ



సెప్టెంబరు 12,
కట్టమూరు గ్రామమునందు
శ్రీ సద్గురు పాదపూజ



సెప్టెంబరు 18,
వినాయకచవితి నాడు
కర్తలచే శ్రీసద్గురు పాదపూజ

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.